

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

**విలేకరులు కావలెను**
తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365



| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక.40 | శనివారం | 5.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.40 | Sturday | 5.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



# నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలి

- కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలించిన సీఎం
- నిర్మాణాల నాణ్యతలో రాజీపడొద్దని ఆదేశం
- కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- మద్దూరులో, హకీంపేట, దౌల్తాబాద్ లలో అభివృద్ధి పనుల పరిశీలన
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని సూచించిన సీఎం



**కొడంగల్:** కొడంగల్‌ను అభివృద్ధి బాట పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకెళ్తున్నారు. అధికారులతో నిరంతర పర్యవేక్షణతోపాటు సీఎం సైతం వరుస పర్యటనలతో పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మొదట నారాయణపేట జిల్లా మద్దూరు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి నిర్మాణంలో ఉన్న డిగ్రీ కళాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అక్కడి నుంచి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను పరిశీలించిన ముఖ్యమంత్రి నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు.

### ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఆదేశం


అనంతరం మద్దూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. పదేళ్ల క్రితం ప్రజల అవసరాల కోసం తన సొంత డబ్బులతో భూమిని సీఎం కొనుగోలు చేశారు. అదే స్థలంలో ఇప్పుడు సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నారు. ఆనాడు ముందుకొచ్చి భూములు ఇచ్చిన రైతులను గుర్తించి ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు.

### హకీంపేట్ ఎడ్యుకేషన్ పనులపై ఆరా

దౌలతాబాద్ మండలం గోకఫసల్వాద్ చేరుకున్న సీఎం నిర్మాణంలో ఉన్న బీసీ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులపై అధికారులను ఆరా తీశారు. అనంతరం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్‌కు సీఎం వెళ్లారు. ఒక్కో ప్రాజెక్టు పనుల్లో పురోగతిపై ఆరా తీశారు. యంగ్ ఇండియా స్కూల్, ప్రభుత్వ మెడికల్ నర్సింగ్ స్కూల్ ఫిజియో థెరపీ, పారామెడికల్ కాలేజీల నిర్మాణాల వద్ద కలియ తిరుగుతూ వివరాలు తెలుసుకున్నారు. వర్షాల సమయంలో నీరు నిలవకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్‌ను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి ల్యాండ్ స్కేపింగ్ పనులకు వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

### అధికారులకు దిశానిర్దేశం

430 పడకల ఆస్పత్రి పనులపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. సమన్వయంతో పనులు చేయించాలని నాణ్యత, సాంకేతిక అం శాలు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీరు నిల్వకుండా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలని ల్యాండ్ స్కేపింగ్ పనులకు వాడాలని సీఎం సూచించారు. అనంతరం కొం దగల్ నియోజవర్గ అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నారాయణ పేట, వికారాబాద్ జిల్లాల్లో పర్యటనల అనంతరం రోడ్డు మార్గాన కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే సీఎం బస చేయనున్నారు. రేపు కొడంగల్‌లో ప్రభుత్వాసుపత్రి ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌ను ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.



# జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

- జియోసింక్రోనస్ కక్ష్యలోకి దేశ మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్
- ఈవోఎస్-05 ఉపగ్రహాన్ని నింగిలోకి ప్రవేశపెట్టిన జీఎస్ఎల్‌వీ-ఎఫ్17 రాకెట్
- శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం రెండో లాంచ్ ప్యాడ్ నుంచి ప్రయోగం
- 'ఇస్రో' విజయం.. దేశానికి గర్వకారణం: మోదీ

2

## కొండా సురేఖ తొలగింపు బాధాకరం: టీపీసీసీ చీఫ్

- అయితే పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని స్పష్టీకరణ
- హద్దులు దాటితే ఎవరిపైనైనా చర్యలు తప్పవని హెచ్చరిక
- పార్టీలోనే కొనసాగితే సురేఖకు అవకాశాలు
- సీఎం ఎవరినీ బ్లాక్‌మెయిల్ చేయరని స్పష్టీకరణ




2

## భారత్ ఆర్థిక వృద్ధితో ప్రపంచంలో విశ్వాసం

- బెల్జియం ప్రధానితో చర్చల్లో మోదీ
- బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్‌తో ప్రధాని మోదీ



## ముడి చమురు చోరీ చేస్తూ.. 37మంది మృతి

రివర్స్‌స్టేట్: నైజీరియా లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ముడిచమురు దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండగా.. విషవాయువులు విడుదలై 37మంది ప్రాణాలు కోల్పోయారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. రివర్స్‌స్టేట్ ప్రాంతంలోని ఓ చమురు పైప్‌లైన్ నుంచి ముడిచమురు దొంగిలించేందుకు కొందరు యువకులు యత్నించారు. ఇండోరామా ఎలెమె పెట్రోకెమికల్ కేంద్రాల నుంచి పోర్ట్ హార్కోర్ట్ రిఫైనరీకి ముడి చమురు సరఫరా చేసే ఓ పైప్‌లోని ట్యాపింగ్ పాయింట్‌కు మరో పైపును అనుసంధానించారు. ఆ పైపుతో తమ ఓడల్లోని ట్యాంకులను నింపుతుండగా విషవాయువులు విడుదలయ్యాయి. దీంతో ఈ విష వాయువులు పీల్చి పలువురు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటివరకు 37 మంది మృతదేహాలను నదిలో నుంచి బయటకు తీసినట్లు తెలుస్తోంది. గల్లంతైన వారికోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.





## కొండా తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?

- మాజీ మంత్రి హరీశ్ రావు
- రేవంత్ ను వ్యక్తిగతంగా విమర్శించారనే కొండా సురేఖపై వేటు
- 22ఏ పేరుతో రైతులను పీడిస్తున్న పొంగులేటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న
- భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నాడని మండిపాటు

2

## 'డిజిటల్ అరెస్ట్' కేసులు

20 రాష్ట్రాల్లో సీబీఐ సోదాలు



హైదరాబాద్: డిజిటల్ మోసాలపై నమోదైన కేసులకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ (జదీ×) కీలక ఆపరేషన్ చేపట్టింది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 89 చోట్ల సోదాలు జరిపింది. మూడు కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న ముగ్గురిని అరెస్టు చేసింది. వారి నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు, డిజిటల్ పరికరాలు, ఇతర కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. డిజిటల్ అరెస్టుల పేరుతో బాధితుల నుంచి రూ.కోట్ల డబ్బును దోచుకోవడం, వాటిని ఇతర ఖాతాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొంది. పోలీసు, ఇతర ప్రభుత్వ అధికారులుగా నటిస్తూ సైబర్ మిగతా 2 లో

## ఒవైసీ సోదరులు దేశ భక్తులు ఎలా అవుతారు..?

రామచందర్‌రావు



హైదరాబాద్: ఒవైసీ సోదరులు దేశ భక్తులు ఎలా అవుతారని సీఎం రేవంత్ రెడ్డిని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. భాజపా జాతీయ కోఆర్డినేటర్‌గా నియమితులైన విష్ణువర్ధన్ రెడ్డి ఆత్మీయ సత్కార సభకు రామచందర్ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "వందేమాతరం ఆలపించని వారు దేశభక్తులు ఎలా అవుతారో ముఖ్యమంత్రి చెప్పాలి. అసలు దేశభక్తి సర్టిఫికెట్ ఇవ్వడానికి రేవంత్‌రెడ్డి ఎవరు? అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి మద్దతునిచ్చే అసదుద్దీన్ ఒవైసీ.. కొత్తగా రేవంత్ రెడ్డికి మద్దతు ఇస్తున్నాం అనడం విడ్డూరంగా ఉంది. అధికార పార్టీలకు మద్దతునిస్తూ ఒవైసీ సోదరులు బాగుపడుతున్నారే తప్పితే.. వాళ్ల వల్ల ఏ ఒక్క ముస్లిం జీవితం బాగుపడలేదు. బెంగాల్‌లో మమతా బెనర్జీ దేశ వ్యతిరేక శక్తులను ప్రోత్సహించినట్లే.. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణలోకి చొరబాటుదారులను, రోహింగ్యాలను తీసుకొస్తున్నారు. బీఆర్ఎస్ పాలనలో కూడా ఏ స్థాయిలో దోచుకున్నారో వారి కుటుంబసభ్యులే చెబుతున్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఫ్యామిలీ, కాంగ్రెస్ పాలనలో రేవంత్ రెడ్డి బ్రదర్స్ రాష్ట్రాన్ని దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

## కొండా సురేఖ తొలగింపు బాధాకరం: టీపీసీసీ చీఫ్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఈ నిర్ణయం బాధ కలిగించేదే అయినా, పార్టీ క్రమశిక్షణే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అధిష్ఠానం కఠిన చర్యలు తీసుకుంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కొండా సురేఖ కుమార్తె సుస్మిత పార్టీపై చేసిన తీవ్ర వ్యాఖ్యలను సురేఖ వెంటనే ఖండించకపోవడాన్ని ఏఐసీసీ చాలా తీవ్రంగా పరిగణించిందని మహేశ్ గౌడ్ తెలిపారు. ఆమె వైఖరి అభ్యంతరకరంగా ఉందని, అందుకే క్రమశిక్షణ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా అధిష్ఠానం ఈ చర్యలు తీసుకుందని వివరించారు. పార్టీలో ఏవైనా సమస్యలు ఉంటే చర్చించడానికి పీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్, ప్రధాన కార్యదర్శి వంటి అనేక అంతర్గత వేదికలు ఉన్నాయని గుర్తుచేశారు. వాటిని కాదని బహిరంగంగా మీడియాతో మాట్లాడటాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని హెచ్చరించారు.

"కాంగ్రెస్ పార్టీలో ఏ నాయకుడైనా మాట్లాడేటప్పుడు హద్దులు దాటితే చర్యలు తప్పవు" అని ఆయన అన్నారు. అయితే, కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఆమె పార్టీలో ఉంటే భవిష్యత్తులో తప్పకుండా అవకాశాలు లభిస్తాయని సూచనప్రాయంగా చెప్పారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎవరినీ రాజకీయంగా బ్లాక్‌మెయిల్ చేయాల్సిన అవసరం లేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన హామీ ఇచ్చారు. వరంగల్ తూర్పు ఎమ్మెల్యేగా ఉన్న కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే.

## కొండా తొలగించారు.. పొంగులేటి సంగతి ఏమిటి?

హైదరాబాద్: తనను వ్యక్తిగతంగా విమర్శించారనే కారణంతోనే కొండా సురేఖను సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేశారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. సురేఖపై చర్యలు తీసుకున్న రేవంత్... 22ఏ నిషేధిత భూముల పేరిట రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలను, రైతులను పట్టి పీడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. రేవంత్ రెడ్డికి, పొంగులేటికి మధ్య ఉన్న రహస్య ఒప్పందం ఏమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. పేదల పట్టా భూములను ఆదరాబాదరాగా నిషేధిత జాబితాలో చేర్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన పొంగులేటిని అసెంబ్లీకి రాకుండా నిషేధించాలని డిమాండ్ చేశారు.

సూర్యుడి చుట్టూ భూమి తిరిగితే... కాంగ్రెస్ పాలనలో భూముల చుట్టూనే రేవంత్ రెడ్డి తిరుగుతున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి ఇల్లు కూడా 22ఏ పరిధిలోనే ఉందని, తన ఇల్లు జాబితాలో పడగానే రాత్రికి రాత్రే ఆంక్షలు తొలగించుకున్న రేవంత్ రెడ్డి... పేద ప్రజల భూములకు వచ్చేసరికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఒక్క కాగజ్‌నగర్ నియోజకవర్గంలోనే ఏకంగా 42,867 ఎకరాల రైతుల పట్టా భూములను 22ఏ జాబితాలో బంధీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిషేధిత జాబితాలోని పేదల భూములను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులతో కలిసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

భూ సమస్యలపై ప్రశ్నిస్తున్న రైతులను కబ్జాదారులు అని సంబోధిస్తూ అవమానించిన రేవంత్ రెడ్డి తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. భూములు 22ఏ జాబితాలోకి వెళ్లడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని మండిపడ్డారు. ఇది ఇందిరమ్మ రాజ్యమా లేక కబ్జాల రాజ్యమా అని నిలదీశారు.

## 'డిజిటల్ అరెస్ట్' కేసులు

నేరగాళ్లు అనేక రాష్ట్రాల్లో డిజిటల్ అరెస్టులకు పాల్పడుతూ బాధితుల నుంచి రూ.కోట్లు కొల్లగొడుతున్న విషయం తెలిసిందే. ఈ తరహా నేరాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన సీబీఐ.. మూడు కేసుల్లో ప్రధాన నిందితులను అరెస్టు చేసింది. ఈ మూడు కేసుల్లోనే బాధితులు సుమారు రూ.42 కోట్లు నష్టపోయినట్లు సీబీఐ వెల్లడించింది. పార్క్ చేస్తుండగా.. స్తంభాన్ని ఢీకొన్న ఇండిగో విమానం బిట్స్ పిలానీకి సంబంధించిన ఓ కేసులో పోలీసు అధికారిగా నమ్మిస్తూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తిని మూడు నెలల పాటు డిజిటల్ అరెస్టు చేశారు. బాధితుడి నుంచి రూ.7.67 కోట్లు దోచుకున్నారు. గుజరాత్‌లో మరో కేసులోనూ పోలీసులుగా నటిస్తూ మరో వ్యక్తి నుంచి రూ.19.24 కోట్లు దోపిడీ చేశారు. కర్ణాటకకు సంబంధించిన కేసులోనూ బాధితుడిని నెల రోజుల పాటు డిజిటల్ అరెస్టు చేసి రూ.14.45 కోట్లు తమ ఖాతాలకు మళ్లించుకోవడం గమనార్హం.

అరెస్టైన వారిలో హరియాణాకు చెందిన ఆకాశ్.. తన అకౌంట్లోకి రూ.1.95 కోట్ల నగదు స్వీకరించినట్లు సీబీఐ గుర్తించింది. కోల్‌కతాకు చెందిన రాజ్ కర్మాకర్ ఖాతాలోకి రూ.1.5 కోట్లు, జ్యోతి రాణి అనే యువతి ఖాతాలోకి భారీ మొత్తంలో మోసపూరిత నగదు వచ్చినట్లు సీబీఐ గుర్తించింది. వీటిలో కొంత నగదు విత్‌డ్రా చేయడం, మిగతా మొత్తాన్ని వివిధ ఖాతాలకు మళ్లిస్తున్నట్లు గుర్తించామని సీబీఐ అధికార ప్రతినిధి పేర్కొన్నారు.

## అమెరికా ప్రతినిధుల పర్యటన.. రష్యాకు జెలెన్‌స్కీ కీలక ప్రతిపాదన

రష్యా: రష్యా- ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వారం చివర్లో అమెరికా రాయబారులు జరేద్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్ ఇరుదేశాల్లోనూ పర్యటించనున్నారు. యుద్ధాన్ని ముగించే అంశంపై చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో జెలెన్‌స్కీ (వ-శ్రీవఅంఎఎ) కీలక ప్రతిపాదన చేశారు. తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలని రష్యాను కోరారు. అమెరికా రాయబారుల పర్యటన సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. రష్యా ఇటీవల కాలంలో పట్టపగలే.. ఉక్రెయిన్‌పై దాడులకు తెగబడుతోంది. ఈ క్రమంలో జెలెన్‌స్కీ ఈ ప్రతిపాదన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు అమెరికా రాయబారుల పర్యటనను జెలెన్‌స్కీ ధ్రువీకరించారు. వారు శనివారం మాస్కోలో, ఆదివారం కీవ్‌లో పర్యటించనున్నట్లు చెప్పారు. ఈ మేరకు అగ్రరాజ్యం నుంచి సమాచారం అందినట్లు టెలిగ్రామ్ వేదికగా వెల్లడించారు. తమవైపు నుంచి ఎలాంటి దాడులు ఉండబోవని, రష్యా కూడా సంయమనం పాటిస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. ఉక్రెయిన్.. రష్యా గురించి పట్టించుకోదని, అమెరికా రాయబారుల పర్యటన సజావుగా సాగాలనే ఉద్దేశంతోనే తాత్కాలిక కాల్పుల విరమణ చేస్తున్నట్లు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. "అమెరికా ప్రతినిధుల ప్రతిపాదనలు ఏంటో? వాటికి మాస్కో ఏమంటుందో చూద్దాం" అంటూ పోస్టు చేశారు.

# జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన +ూాఎ-ఫీ17 రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి జియో-ఆర్బిట్ కోసం ఉద్దేశించిన అత్యాధునిక ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహం జుూా-05ను కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. వ్యవసాయం, విపత్తు నిర్వహణ వంటి రంగాల్లో రియల్ టైమ్ ఇమేజరీ అందించడంలో ఈ ఉపగ్రహం ఎంతో కీలకం కానుంది.

రెండో లాంచ్ ప్యాడ్ నుంచి వేకువజామున 2గంటల 55నిమిషాలకు జీఎస్ఎల్వీ17 రాకెట్ అత్యాధునిక భూ పరిశీలన ఉపగ్రహం జుూా-05ను నింగిలోకి మోసుకెళ్లింది. సబ్-జియోసింక్రనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. సుమారు 8నెలల విరామం తర్వాత ఇస్రో ఈ మిషన్‌ను చేపట్టింది. +ూాఎ సిరీస్‌లో ఇది 19వ రాకెట్ ప్రయోగం. 2,268 కిలోల బరువు ఉన్న జుూా-05 ఉపగ్రహం సరిహద్దు ప్రాంతాలను వేగంగా, స్పష్టంగా కెమెరాలతో పరిశీలించనుంది. తుపానులు వరదలు, భూకంపాలను నిమిషాల వ్యవధిలోనే గుర్తించనుంది. ప్రకృతి విపత్తులపై ముందస్తు హెచ్చరికలను జారీ చేయనుంది. పంటల ఆరోగ్యం, భూ వినియోగంలో మార్పులను పరిశీలించనుంది. దేశ రక్షణరంగంలో ఈ ఉపగ్రహం కీలకం కానుంది. సరిహద్దుల సమాచారాన్ని రియల్ టైమ్‌లో సేకరించనుంది.

వరుసగా ఎదురైన వైఫల్యాల తర్వాత ఇస్రో సాధించిన ఈ విజయం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు చేపట్టిన 18 ప్రయోగాల్లో ఈ రాకెట్ 6సార్లు పూర్తిస్థాయి విజయాన్ని నమోదుచేయలేకపోయింది. 2021లో మిషన్ ప్రయోగం 307సెకన్ల తర్వాత క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్‌లో తలెత్తిన సాంకేతిక లోపంతో విఫలమైంది. దానికి ప్రత్యామ్నాయంగా ఈ మిషన్‌ను విజయవంతంగా చేపట్టారు. అంతకుముందు ఈ ఏడాది జనవరి 12న 16ఉపగ్రహాలతో ప్రయోగించిన ూాఎ-జ62 రాకెట్ కీలకమైన మూడోదశలో తలెత్తిన లోపం కారణంగా నిర్దేశిత కక్ష్యలోకి చేరలేకపోయింది. 2025 మే నెలలో చేసిన ూాఎ-జ 61 ప్రయోగం కూడా మోటార్ కేస్‌లో ప్రెజర్ సమస్యల వల్ల సక్సెస్ కాలేదు. ఈ నేపథ్యంలో ఇస్రో సుదీర్ఘ విరామం తర్వాత +ూాఎ-ఫీ17 రాకెట్ ప్రయోగం విజయవంతం చేసింది.

### తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే



మరోవైపు ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా తొలి మానవరహిత మిషన్‌ను ఈ ఆర్థిక సంవత్సరంలోనే ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఇస్రో ఛైర్మన్ ఎ.నారాయణన్ వెల్లడించారు. దీనికోసం వివిధ పరిశ్రమలు, ఇతర సంస్థలతో కలిసి ఇస్రో బృందం అత్యంత ప్రణాళికాబద్ధంగా, ముమ్మరంగా పనిచేస్తోందని తెలిపారు. ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టాక ఇస్రో ఛైర్మన్ శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఈఓఎస్-05 ప్రయోగం ద్వారా ఇస్రో తొలి విజయాన్ని నమోదు చేసిందని పేర్కొన్న ఆయన, కష్టానికి దక్కే ప్రతిఫలం మరింత కష్టపడటమేనని ఉద్ఘాటించారు. దేశ బహుళ అవసరాల నిమిత్తం భూమిని నిశితంగా పరిశీలించేందుకు 36,000 కి.మీ.లు జియో సింక్రనస్ ప్లాట్‌ఫారమ్‌లో ఉంచుతున్న మొట్టమొదటి ఉపగ్రహం ఇదే కావడం విశేషమని అన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అభినందనలు జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ ద్వారా ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ 'ఎక్స్' వేదికగా ఇస్రో బృందానికి అభినందనలు తెలిపారు. 'అంతరిక్ష రంగంలో భారత్ సాధించిన మరో అతిపెద్ద పేలోడ్ ఇది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో భారతదేశ అంతరిక్ష సామర్థ్యాలు సరికొత్త శిఖరాలకు చేరుకుంటున్నాయి. ప్రపంచ అంతరిక్ష శక్తిగా మన దేశం బలపడుతోంది' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు.

### 'ఇస్రో' విజయం.. దేశానికి గర్వకారణం: మోదీ

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సాధించిన చరిత్రాత్మక విజయాన్ని ప్రధాని మోదీ అభినందించారు. జీఎస్ఎల్వీ-ఎఫ్17 మిషన్ విజయవంతం కావడం.. దేశానికి గర్వకారణమంటూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. అంతరిక్ష రంగంలో భారత సాంకేతిక సామర్థ్యానికి ఇది మరొక నిదర్శనమంటూ ప్రధాని (ౢావీ వీశీఎఱ) ప్రశంసలు కురిపించారు.

"ఇస్రో (×ూా=ూా) సాధించిన మరొక అద్భుతమైన విజయం ఇది. మన దేశానికి ఇది ఎంతో గర్వకారణమైన క్షణం. జియోసింక్రోనస్ కక్ష్య నుంచి భారత్ ప్రయోగించిన మొట్టమొదటి ఇమేజింగ్ శాటిలైట్ ఈవోఎస్-05.. జీఎస్ఎల్వీ-ఎఫ్17 ద్వారా జరిగిన ఈ విజయవంతమైన ప్రయోగం.. భారత అంతరిక్ష రంగం సాధిస్తోన్న అత్యుత్తమ ప్రగతికి, ఆవిష్కరణలకు, విస్తృత సామర్థ్యాలకు ప్రతీకగా నిలిచింది. ఇస్రో, భారతీయ పరిశ్రమల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం మన అంతరిక్ష రంగాన్ని ముందుకు తీసుకువెళ్లడంతో పాటు.. ఈ రంగంలో మన సమర్థతను మరింత బలోపేతం చేస్తోంది" అని మోదీరాసుకొచ్చారు.

### ఈఓఎస్-05 ప్రయోగం దిగ్విజయం

శుక్రవారం తెల్లవారుజామున 2.55 గంటలకు షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్17 (జీఎస్ఎల్వీ17) వాహకనౌక మేఘాలను చీల్చుకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. ఈ వ్యోమనౌక ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని సబ్-జియో సింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్(సబ్-జీటీఓ)లోకి కచ్చితత్వంతో ప్రవేశపెట్టింది. సరిహద్దుల్లో శత్రు దేశాలు సైనిక స్థావరాలను ఎంత రహస్యంగా దాచినప్పటికీ.. వాటిని ఇట్టే పసిగట్టే సత్తా ఈ ఉపగ్రహానికి ఉంది. భవిష్యత్తులో ప్రకృతి విపత్తులను, వాటి తీవ్రతను ఇది అంచనా వేయనుంది.

## భారత్ ఆర్థిక వృద్ధితో ప్రపంచంలో విశ్వాసం

దిల్లీ: సవాళ్లతో కూడిన ప్రస్తుత వాతావరణంలో కూడా భారత్ నిలకడగా వృద్ధి సాధిస్తోందని, ఈ గాథ.. సరికొత్త అవకాశాలపై ప్రపంచానికి విశ్వాసం కలిగిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత త్రైమాసికంలో 7.8% వృద్ధిరేటు నమోదైందని గుర్తుచేశారు. బెల్జియం ప్రధాని బార్ట్ డె వెవర్‌తో గురువారం చర్చలు జరిపిన తర్వాత ఈ మేరకు ఆయనొక ప్రకటన చేశారు. వాణిజ్యం, రక్షణ, విలువైన ఖనిజాలు, శుద్ధ ఇంధనం, సాంకేతికతల రంగాల్లో సహకారాన్ని విస్తృతం చేసుకోవాలని ఇరు దేశాలూ నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "విస్తృతంగా, వ్యూహాత్మక రీతిలో భారత్-బెల్జియం మధ్య సంబంధాలు బలపడుతున్నాయి. భారత్-బెల్జియం మధ్య రక్షణ, భద్రత రంగాల్లో సహకారం ఇరు దేశాల మొత్తం సంబంధాలకు మూల స్తంభంగా నిలుస్తుంది. ప్రతిభను ప్రోత్సహించేలా వలసల పరంగానూ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంటాం" అని మోదీ వివరించారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా ఘర్షణలకు చర్చలు, దౌత్యమార్గాల ద్వారా ముగింపు పలకాలని ఇరువురు ఆకాంక్షించినట్లు చెప్పారు.

**ఒప్పందాలు ఖరారు**

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రాబోయే ఐదేళ్లలో రెట్టింపు చేసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. దీంతోపాటు రక్షణ సంబంధాల మెరుగు, పునరుత్పాదక ఇంధన రంగంలో సహకారం వంటి అంశాలపై ఐదు ఒప్పందాలపై రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. రక్షణ రంగ పరిశ్రమలపై మరో 10 ఒప్పందాలు కుదిరాయి. బెల్జియం సైన్యం అందించే సాంకేతికతతో మన దేశంలో రాకెట్లు తయారు చేయడం దీనిలో ఒకటి. కీలకమైన సైనిక హార్డ్‌వేర్‌ను పాకిస్థాన్‌కు సరఫరా చేయబోమని బెల్జియం స్పష్టం చేసినట్లు సమాచారం.



### మోదీ కోసం ఆ బహుమతి ఇద్దామనుకుంటే..

ప్రధాని మోదీకి బెల్జియం ప్రధాని వెవర్ ఓ అరుదైన కానుక ఇవ్వాలనుకున్నారు. బెల్జియంలోని అత్యుత్తమ చాక్లెట్‌తో ప్రత్యేకంగా రూపొందించిన ఇండియా గేట్ ప్రతిరూపాన్ని బహుమతిగా తీసుకొచ్చారు. ప్రయాణ సమయంలో సున్నితమైన చాక్లెట్ శిల్పం కరిగిపోవడంతో దాన్ని అందించలేకపోయారు. మరో ప్రతిరూపం బెల్జియంలో సిద్ధంగా ఉందని.. ఎలాగైనా దాన్ని మోదీకి సురక్షితంగా అందిస్తానని వెవర్ చెప్పారు.

## కొండా కు అధికారిక భద్రత ఉపసంహరించుకున్న రేవంత్ ప్రభుత్వం

### ప్రభుత్వ నిర్ణయంపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక భద్రతను పూర్తిగా ఉపసంహరించుకుంది. మంత్రివర్గం నుంచి ఆమెను తొలగించిన మరుసటి రోజే ఈ చర్యలు తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మంత్రి హోదాలో ఆమెకు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో పాటు, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ పరిధిలోని ప్రత్యేక గన్‌మన్లను ప్రభుత్వం తక్షణమే వెనక్కి పిలిపించింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే ఆమె భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను రద్దు చేస్తూ అధికారులు చర్యలు చేపట్టారు. దీనితో ఆమె అధికారిక కాన్వాయ్, ఎస్కార్ట్ భద్రత పూర్తిగా నిలిచిపోయాయి.

ప్రోటోకాల్ నిబంధనల ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఒక వ్యక్తి మంత్రి పదవిలో లేనప్పుడు, వారికి కేటాయించిన ప్రత్యేక భద్రతను ఉపసంహరించడం సాధారణ ప్రక్రియ అని అధికారులు పేర్కొంటున్నారు. అయితే, మంత్రి పదవి నుంచి తొలగించిన వెంటనే ఇంత వేగంగా భద్రతను వెనక్కి తీసుకోవడంపై రాజకీయ విశ్లేషకులు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# నేపాల్ టన్నెల్ ఆపరేషన్‌లో అద్భుతం!

### ఆ సన్నని గొంతే ఆశలు నింపి..

నేపాల: నేపాల్ విలయంలో గల్లంతైన తమవారు బతికి వస్తారనే ఆశలు సన్నగిల్లుతోన్న వేళ ఓ అద్భుతం జరిగింది. 9 రోజులుగా ఎదురుచూసి.. కొందరి కర్మకాండలు కూడా చేస్తున్న సమయంలో టన్నెల్ నుంచి ఇద్దరు సజీవంగా బయటపడటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది . భోటెకోషి నది ఉప్పొంగడంతో 60 మెగావాట్ల హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దెబ్బతినగా.. పలువురు సిబ్బంది త్రిశూలి 3ఏ టన్నెల్‌లో చిక్కుకుపోయారు. అలా కొట్టుకుపోయిన వారి సంఖ్య 42గా తెలుస్తోంది. తాజాగా సహాయ సిబ్బంది ఇద్దరిని రక్షించడంతో మిగిలిన వారూ ప్రాణాలతో బయటపడతారనే ఆశలు చిగురించాయి. మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్, మెకానికల్ సూపర్‌వైజర్ కబీర్ మహర్జన్‌ను సొరంగంలో 170 మీటర్ల లోతు నుంచి కాపాడినట్లు నేపాల్ ఆర్మీ ప్రతినిధి బ్రిగేడియర్ జనరల్ రాజారామ్ బాస్నెట్ వెల్లడించారు.

సహాయక చర్యలను పర్యవేక్షించే అధికారులు, నిపుణులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మామూలుగా సొరంగం వంటి భూగర్భ ప్రాంతాల్లో కార్మికులు, పర్యాటకులకు సురక్షితమైన ఆక్సిజన్‌తో కూడిన ఎయిర్ ప్యాకెట్స్, ట్రాప్డ్ వాటర్ ఉంటాయి. టన్నెల్ లోపల హానికర వాయువుల కారణంగా ప్రాణాలు కోల్పోకుండా బయటనుంచి పైపులు ద్వారా ఆక్సిజన్ పంపుతుంటారు. మరోవైపు, టన్నెల్ లో చిక్కుకుపోయిన సందర్భంలో తమను తాము



రక్షించుకోవడానికి ఎత్తుగా ఉన్నవైపు వస్తుంటారు. కానీ, నేపాల్ జల ప్రళయంలో రాళ్లు, వరద, బురద పెద్ద ఎత్తున కొట్టుకురావడంతో అవి వారిని కిందికి నెట్టేసి ఉండొచ్చు కూడా. చిక్కుకున్న వారు ప్రాణాలతో ఉన్నారా..? లేరా..? అనే ఊగిసలాట మధ్య సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బండరాళ్లు, శిథిలాలు తొలగిస్తుండగా.. సమీపానికి వెళ్లేకొద్దీ వారికి లోపల ఉన్నవారి గొంతు సన్నగా వినిపించింది. లోపల దొరికిన నీరు, ఆహారంతో ప్రాణాలు నిలబెట్టుకున్న ఇద్దరు వ్యక్తులు సహాయక సిబ్బందికి కనిపించారు. ప్రమాదకర పరిస్థితుల్లో వారు సొరంగంలోకి దిగి, ఆ ఇద్దరినీ బయటకు తీసుకొచ్చిన దృశ్యాలను నేపాల్ ఆర్మీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. "ఆశ అందించిన అద్భుత విజయం ఇది" అని పేర్కొంది.

"ఈ రెస్క్యూ ఆపరేషన్ అన్నింటినీ తిరగరాస్తోంది. ఎందుకంటే ఇంతకముందెప్పుడు ఈ స్థాయిలో విద్యుత్ కేంద్రాలు ధ్వంసమై, పలు సొరంగాల్లో సహాయక చర్యలు చేపట్టిన పరిస్థితి లేదు. కార్ల పరిమాణంలో ఉన్న రాళ్లను పగలగొట్టాం. ఇద్దరిని కాపాడటంతో లోపల ఉన్నవారు బతికే ఉండొచ్చనే అనుమానానికి ఇప్పుడు మాకు ఆధారం లభించింది. మేం పడిన శ్రమకు ఫలితం కనిపిస్తోంది" అని ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్న టన్నెల్ రెస్క్యూ ఎక్స్‌పర్ట్ ఆర్నాల్డ్ డిక్స్ జాతీయ మీడియాతో అన్నారు. 2023లో ఉత్తరాఖండ్ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన ఆస్ట్రేలియాకు చెందిన ఈ నిపుణుడు.. భారత్‌కు సుపరిచితులు. ప్రస్తుతం టన్నెళ్ల వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇది తనకు పునర్జన్మ అని మెకానికల్ ఫోర్‌మెన్ సంజయ్ సాహ్ అన్నారు. ప్రాణాపాయ స్థితిలో హరే కృష్ణ మహామంత్రాన్ని జపిస్తూనే ఉన్నానని చెప్పారు.

# వరుస చోరీలకు పాల్పడుతున్న తండ్రీకొడుకుల అరెస్టు

**- 90 తులాల వెండి, నగదు స్వాధీనం**

**- 17 కేసుల్లో నిందితుడిగా ఉన్న రోహిత్**



తొలివెలుగు, ఆదిబట్ల : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న తండ్రీకొడుకులను ఆదిబట్ల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ.12,120 నగదు, 90 తులాల కరిగించిన వెండి కడ్డీతో పాటు చోరీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయంలో జనవరి 26,27 తేదీల మధ్య చోరీ జరిగింది. ఆదిబట్ల పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా విచారణ చేపట్టి, ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఈ నేరానికి పాల్పడినట్లు గుర్తించారు. సెప్టెంబరు 3న బొంగులూరు గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న కాలివాల రోహిత్ (28), అతని తండ్రి కాలివాల సోమరాజ్ (60)లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు చోరీకి ఒప్పుకొన్నారు. ప్రధాన నిందితుడు రోహిత్‌పై గతంలోనే 17 చోరీ కేసులు ఉన్నాయని ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు. ఆలయంలో దొంగిలించిన వెండిని కరిగించి విక్రయించేందుకు యత్నిస్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన ఎస్ఐ నోయల్ రాజ్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# అభివృద్ధిపై ఆధారాలతో మాట్లాడాలి

**- మాజీ ఎమ్మెల్యే విమర్శలకు కాంగ్రెస్ గట్టి కౌంటర్**

**- నియోజకవర్గానికి వందల కోట్ల నిధులు తెచ్చిన ఘనత ఎమ్మెల్యే కుంభానిదే: సహదేవ్ గౌడ్**



తొలివెలుగు, వలిగొండ: భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తన పదేళ్ల పాలనలో నియోజకవర్గానికి చేసిన అభివృద్ధిని ఆధారాలతో నిరూపించి మాట్లాడాలని వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిపై శేఖర్‌రెడ్డి చేస్తున్న విమర్శలను ఆయన తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, జిల్లా కార్యదర్శి చెరుకు శివయ్య గౌడ్‌లతో కలిసి సహదేవ్ గౌడ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రైతుల సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని భునాదిగాని కాలువ వెడల్పునకు రూ.240 కోట్లు, ధర్మారెడ్డిపల్లి కాలువకు రూ.150 కోట్లు మంజూరు చేయించినట్లు సహదేవ్ గౌడ్ పేర్కొన్నారు. అలాగే పదేళ్లుగా పరిష్కారం కాని బస్వాపూర్ ప్రాజెక్టు ముంపు బాధితుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఎమ్మెల్యే కుంభం తీసుకెళ్లి రూ.206 కోట్ల పరిహారం మంజూరు చేయించారని తెలిపారు. వలిగొండలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి రూ.250 కోట్లు, భీమలింగం ఐ-లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.56 కోట్లు తీసుకురావడంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్న ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సరికాదన్నారు. అధికారం కోల్పోయిన నిరాశతోనే మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్నారని సహదేవ్ గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ నాయకులు విమర్శలకు స్వస్తి పలికి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకి రాములు, మత్స్యగిరిగుట్ట డైరెక్టర్ కూర వెంకన్న, వలిగొండ విండో డైరెక్టర్ ఎంఏ మల్లేశం, నాయకులు కాసుల వెంకన్న గౌడ్, పాలకుర్ల వెంకటేష్ గౌడ్, చిలుకూరు సత్తిరెడ్డి, ఉలిపే మల్లేశం, ఎండీ కుర్షిద్ తదితరులు పాల్గొన్నారు.

# శోకసంద్రంలో కనుముక్కల: నాయకుడికి కడసారి వీడ్కోలు



**- అంత్యక్రియలకు హాజరైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు**

**- పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు: జగదీశ్‌రెడ్డి**

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి : బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కోట మల్లారెడ్డి భౌతికకాయానికి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సహా పలువురు ప్రముఖులు అశ్రునయనాలతో ఘన నివాళులర్పించారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని కనుముక్కల గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో వారు పాల్గొని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి పార్టీ వెన్నుదన్నుగా నిలిచి బలోపేతానికి మల్లారెడ్డి ఎనలేని సేవలు అందించారని, ఆయన ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. అంతకుముందు మాజీ జడ్పీ చైర్మన్లు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి మల్లారెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగానూ సేవలందించిన మల్లారెడ్డి మృతితో కనుముక్కలలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పచ్చిమట్ల శివరాజ్‌గౌడ్, అంగాల వెంకన్నగౌడ్, మాజీ రైతు వన సమితి అధ్యక్షుడు కొలుకులపల్లి అమరేందర్, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్యగౌడ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కందడి భూపాల్‌రెడ్డి, మండల నాయకులు రావుల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల, పట్టణ శాఖ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేష్, గ్రామ సర్పంచ్ చుక్క శోభా శంకర్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, కౌన్సిలర్లు కుడికల అఖిల బలరాం, దేవరాయ కుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బస్సు చక్రాల కింద నలిగి ఉపాధ్యాయురాలు దుర్మరణం



**- కళ్లెదుటే భార్య మృతి.. పసిపాపలకు తప్పిన ముప్పు**

**- మాంచెస్టర్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సు నిర్లక్ష్యమే కారణం**

తొలివెలుగు, వనస్థలిపురం :ద్విచక్రవాహనాన్ని స్కూలు బస్సు వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందారు. వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజాపూర్‌కు చెందిన అడతి భాగ్యలత అలియాస్ వాణి (32) ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. సెప్టెంబరు 3న సాయంత్రం ఆమె తన భర్త సురేందర్ (40), కుమార్తెలు దాక్షాయని (2), భవిజ్ఞ (1)లతో కలిసి స్కూటీపై బీఎన్ రెడ్డినగర్ వైపు బయలుదేరారు. లైఫ్‌కేర్ ఆస్పత్రి సమీపంలోకి రాగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన మాంచెస్టర్ ఇంటర్నేషనల్ స్కూలు బస్సు వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భాగ్యలత బస్సు చక్రాల కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. భర్త, కుమార్తెలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొలుత స్థానిక ఆస్పత్రికి, ఆపై కామినేని, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున భాగ్యలత ప్రాణాలు కోల్పోయారు. మృతురాలి తండ్రి నర్సన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# అనారోగ్యం తాళలేక వృద్ధుడి ఆత్మహత్య

తొలివెలుగు, రామన్నపేట:తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామన్నపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలగూడెం గ్రామానికి చెందిన నాగు కృష్ణయ్య (60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన ఆయన సెప్టెంబరు 1న మధ్యాహ్నం పొలం వద్ద పురుగుల మందు తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రామన్నపేట ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కామినేని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబరు 3న రాత్రి కృష్ణయ్య మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ గోపాతి తెలిపారు.



# రామన్నపేట ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయాలి

**- నకిరేకల్ సభలో సీఎం ప్రకటన చేయాలి: సీపీఎం**

**- ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన ప్రదర్శన**

తొలివెలుగు, రామన్నపేట:రామన్నపేట ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి మండలంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఎం




జిల్లా కార్యదర్శి ఎం.డి. జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రికి నూతన భవనం మంజూరు చేస్తున్నట్లు నకిరేకల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని, రానున్న అసెంబ్లీ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో సరిపడా పడకలు, వైద్య సిబ్బంది, మౌలిక వసతులు లేకపోవడంతో పాటు భవనం శిథిలావస్థకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రెండు నెలలు గడుస్తున్నా ఎలాంటి పురోగతి చూపలేదని విమర్శించారు. ప్రభుత్వం స్పందించే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, బుర్రు అనిల్‌కుమార్, గొరిగే సోములు, గాదె నరేందర్, నీల అయిలయ్య, తోలుపునూరి శ్రీనివాస్, మునికుంట్ల లెనిన్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రాము, పల్లె సత్యం, బావండ్లపల్లి సత్యం, ఎం.డి. లతీఫ్, ఆముద ఆంజనేయులు, జల్లెల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

- గోప, గోపికల వేషధారణలో చిన్నారుల నృత్య ప్రదర్శనలు.. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు




తొలివెలుగు, రాజాపేట : శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు, నైవేద్యాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. రాజాపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వైదిక నిర్వహణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైష్ణవ, స్మార్త సంప్రదాయాలను అనుసరించి ఒకే రోజు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను నిర్వహించినట్లు అర్చకులు తెలిపారు. తిరుమల గ్రూప్స్ అధినేత, ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ గుప్త ఆధ్వర్యంలో, శాశ్వత బియ్యం దాత పుల్లూరు ఉపేందర్ గుప్త-సూర్యకళ పుణ్య దంపతుల సహకారంతో వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గోప, గోపికల వేషధారణలో నిర్వహించిన సామూహిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం రాత్రి 7 గంటల నుంచి బాలకృష్ణుడికి పంచామృత, ఫలరస అభిషేకాలు, నవనీత నైవేద్యం, మంగళ నీరాజన సేవ, హరినామ సంకీర్తన, భజనలు, డోలోత్సవం, పవళింపు సేవ, మహదాశీర్వచనం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేపట్టారు. దాత మంచాల భద్రయ్య-కవిత పుణ్య దంపతుల సహకారంతో గోప, గోపికల వేషధారణలో పాల్గొన్న చిన్నారులకు ప్రత్యేక బహుమతులు అందించి అభినందించారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీకృష్ణుడిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ భక్తులకు వేద ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.





## బుజ్జి కృష్ణుల సందడి.. పరవశించిన రామన్నపేట

- రామన్నపేటలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- కృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు
- ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న బాలబాలికలు
- చిన్నారుల సందడితో పండుగ వాతావరణం
- వేడుకలను తిలకించేందుకు తరలివచ్చిన స్థానికులు



తొలివెలుగు, రామన్నపేట : శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని రామన్నపేట మండల కేంద్రంలో శుక్రవారం చిన్నారులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తుల్లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబైన చిన్నారులు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. చిన్నారుల వేషధారణలు, ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని తిలకించేందుకు స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీకృష్ణుడి బాల్యలీలలు, భక్తి భావాన్ని ప్రతిబింబించేలా వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సందడి, శ్రీకృష్ణ నామస్మరణలతో మండల కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. వేడుకల్లో పాల్గొన్న చిన్నారులను స్థానికులు అభినందించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

- శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. ఉట్టి కొట్టిన యాదవ సంఘం నాయకులు



తొలివెలుగు, చిట్యాల : శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని చిట్యాల పట్టణంలో శుక్రవారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శ్రీకృష్ణుని జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. భక్తులు, యాదవ సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణుని నామస్మరణలతో సందడి చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కుండలో పంచామృతాలను నింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం కుండను ఉట్టికి కట్టి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు జడల ఆది మల్లయ్య, జడల చిన్న మల్లయ్య, ఆగు సైదులు, మెండే సైదులు, గుండెబోయిన సైదులు, ఏర్పుల పరమేష్, బెల్లి సత్తయ్య, కడారి దేవి, ఏర్పుల స్వామి, ఎల్లా మల్లేశం, యాళ్ల బయన్న, ఆగు అశోక్, ఆగు వెంకన్న, చింతపల్లి ప్రవీణ్, మద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి-యువజన ర్యాలీని విజయవంతం చేయాలి

- సెప్టెంబర్ 5న ఆలేరులో భారీ ర్యాలీ.. విద్యార్థులు, యువత అధిక సంఖ్యలో తరలిరావాలి: పల్లె సంతోష్ గౌడ్



తొలివెలుగు, రాజాపేట : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సెప్టెంబర్ 5న ఆలేరులో నిర్వహించనున్న విద్యార్థి-యువజన భారీ ర్యాలీని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ యువజన విభాగం రాజాపేట మండల అధ్యక్షులు, రఘునాథపురం గ్రామ సర్పంచి పల్లె సంతోష్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ఆలేరులోని పాల సెంటర్ నుంచి బస్టాండ్ వరకు విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల సమస్యలను ప్రభుత్వం...

# విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవం




- శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు.. దేశం, ధర్మాన్ని కాపాడుకోవాలి: కొండ సురేష్

తొలివెలుగు, రాజాపేట : యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి ప్రఖండ పరిధిలోని రేణికుంట గ్రామంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, విశ్వహిందూ పరిషత్ స్థాపన దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొండ సురేష్ మాట్లాడుతూ.. దేశం, ధర్మం మానవునికి రెండు కళ్ల వంటివని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమాజంలో ఐక్యత, ధార్మిక చైతన్యం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న దుశెట్టి బాలకిషన్ మాట్లాడుతూ.. సమాజంలో హిందువులపై జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ధర్మ పరిరక్షణకు సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి బూరుగు సంతోష్ రెడ్డి, రాజాపేట మండల కార్యదర్శి ఇమ్మడి ఓం ప్రకాష్, ఆడెపు బాలకృష్ణ, మాచర్ల మల్లేష్, ఎర్ర విజయ, ఐరేని శ్రీధర్, పబ్బోజు శ్రీధర్, ఆడెపు వెంకటయ్య, అవధూత బాబు, రేగొండ పాండురంగం, పాండు పంతులు, మాచర్ల రాణి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన.. శ్రీ భవానీమాతకు విశేష పూజలు



- శ్రావణమాసం నాలుగో శుక్రవారం ప్రత్యేక పూజలు
- శ్రీచక్రాలపై కుంకుమార్చన నిర్వహించిన మహిళా భక్తులు
- వేద మంత్రోచ్ఛరణల మధ్య కొనసాగిన పూజా కార్యక్రమాలు
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు
- భక్తుల కోసం ఆధ్యాత్మిక కార్యక్రమంద నిర్వహించిన ఆలయ కమిటీ



తొలివెలుగు, చౌటుప్పల్ : శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా చౌటుప్పల్ భవానీనగర్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో మహిళా భక్తులచే ప్రత్యేక కుంకుమార్చన కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ట్రినిటీ విద్యాలయాల సంస్థ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కాశీ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన శ్రీచక్రాలపై మహిళా భక్తులు కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ వేద మంత్రోచ్చరణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కుంకుమార్చనలో పాల్గొన్న ప్రతి భక్తురాలిపై శ్రీ భవానీమాత ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో చౌటుప్పల్ మున్సిపల్ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకున్నారు.

భక్తుల కోసం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించిన దేవాలయ కమిటీ ధర్మకర్తలను అభినందించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోషిక వినయ్‌కుమార్, పిల్లలమర్రి మధుసూదన్, బత్తుల వాణి విప్లవ్ గౌడ్, కాసర్ల మంజుల, కోఆప్షన్ సభ్యులు సందగళ్ల విజయ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్య, ట్రినిటీ విద్యాలయాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జినీ మంజుల, పెద్ది స్వాతి కిషోర్ శర్మ, ధర్మకర్తలు వరకాల రవిగౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్‌రెడ్డి, గగులోతు అరుణ, బొబ్బిళ్ల సంధ్య, వర్కాల వెన్నెల, పబ్బు శ్రీకాంత్ గౌడ్, మోగుదాల వెంకటేష్ గౌడ్ తదితరులు, పలువురు మహిళా భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# చిన్నికృష్ణుల సందడి.. ఉట్టి కొట్టిన విద్యార్థులు



- విశాల భారతి హైస్కూల్‌లో అంగరంగ వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- కృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించిన చిన్నారులు
- ఆటపాటలతో సందడి చేసిన విద్యార్థులు
- భారతీయ సంస్కృతి ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తుంది: వీసం చైతన్య క్రాంతి వర్ధన్‌రెడ్డి
- వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

తొలివెలుగు, చౌటుప్పల్ : చౌటుప్పల్‌లోని విశాల భారతి హైస్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై ఆటపాటలతో అలరించారు. చిన్నారుల సందడితో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడి గొప్పతనాన్ని, ఆయన బోధించిన విలువలను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు విద్యార్థుల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంలో ఎంతో దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# లింగన్న గౌడ్‌ను పరామర్శించిన జాన్సన్ నాయక్

- ఆరోగ్య పరిస్థితిపై ఆరా..

త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



తొలివెలుగు, జన్నారం :ఇటీవల కంటికి శస్త్రచికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గాజుల లింగన్న గౌడ్‌ను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుక్య జాన్సన్ నాయక్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా లింగన్న గౌడ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని సాధారణ స్థితికి చేరుకోవాలని జాన్సన్ నాయక్ ఆకాంక్షించారు. ఆయన వెంట కామనపల్లి సర్పంచ్ పేరం శ్రీనివాస్, ఉపసర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకురాలు ఈశ్వర బాయి, బీఆర్ఎస్ మండల నాయకులు గుర్రం రాజారాం రెడ్డి, చెట్‌పల్లి సత్యం, సాయిని ప్రసాద్, నేత సులువ జనార్ధన్, ఫజల్ ఖాన్, జాడి గంగాధర్, దేవయ్య, ప్రేమ్ సాగర్ తదితర పార్టీ నాయకులు ఉన్నారు.

# నేపాల్ వరద బాధితులకు అండగా కేంద్రం

- మృతదేహాల గుర్తింపునకు డీఎన్ఏ పరీక్షల సాయం
- నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం భారత్ కీలక నిర్ణయం
- బాధితుల సమీప బంధువులకు ఉచితంగా డీఎన్ఏ ప్రొఫైలింగ్
- కేంద్ర, రాష్ట్ర ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సేవలు అందుబాటులోకి
- గుర్తుతెలియని మృతదేహాలతో డీఎన్ఏ సరిపోల్చే అవకాశం



నేపాల్: నేపాల్‌ను అతలాకుతలం చేసిన ఆకస్మిక వరద ఊళ్లకు ఊళ్లను ఊడ్చేసింది. ఈ పెను విపత్తులో భారతీయులు కూడా మరణించారు. ఈ క్రమంలో తమ ఆత్మీయుల జాడ తెలియక దేశంలోని అనేక కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి. బురద, శిథిలాల నుంచి వెలికితీస్తున్న మృతదేహాలను గుర్తించడం నేపాల్ అధికారులకు పెద్ద సవాల్‌గా మారిన తరుణంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గల్లంతు అయిన వారి ఆచూకీ కోసం, దొరికిన మృతదేహాల గుర్తింపు కోసం సాయం చేయాలని కేంద్ర విదేశాంగ శాఖ నిర్ణయించింది. వరదల్లో చనిపోయిన వారి మృతదేహాలను గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కీలకంగా మారాయి.

దేశంలోని కేంద్ర, రాష్ట్ర స్థాయి ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ద్వారా డీఎన్ఏ ప్రొఫైలింగ్ సేవలను ఉచితంగా అందుబాటులోకి తెస్తున్నట్లు ఎంఈఏ పేర్కొంది. నేపాల్‌లో గల్లంతైన వారి బంధువులు అంటే తండ్రి, తల్లి, కుమారుడు, కుమార్తె లేదా తోబుట్టువులు ప్రస్తుతం భారత్‌లో నివసిస్తుంటే, వారు ఈ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపింది. సమీప బంధువుల నుంచి డీఎన్ఏ నమూనాలను సేకరించి, వాటి ఆధారంగా డీఎన్ఏ ప్రొఫైల్‌ను సిద్ధం చేయాలని వెల్లడించింది. అలా నేపాల్లో గుర్తుతెలియని మృతదేహాలను డీఎన్ఏతో పోల్చడం ద్వారా వారి గుర్తింపు నిర్ధారించే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది.

## ఫోరెన్సిక్ ల్యాబ్‌ల సేవలు

ఈ డీఎన్ఏ ప్రొఫైలింగ్ కోసం దేశంలోని వివిధ ఫోరెన్సిక్ సంస్థల సేవలను కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీస్ (సీఎఫ్ఎస్ఎల్), స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీస్ (ఎస్ఎఫ్ఎస్ఎల్), నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) ప్రయోగశాలల్లో ఈ సేవలు పొందవచ్చని విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అలాగే డీఎన్ఏ ప్రొఫైలింగ్ సామర్థ్యం కలిగిన ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లోనూ ఈ పరీక్షలు నిర్వహించవచ్చని తెలిపింది. వరదల్లో గల్లంతైన తమ కుటుంబ సభ్యుల ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న వారికి ఈ సదుపాయం ఎంతో ఉపయోగపడనుంది.

## ఆటోసోమల్ ఎస్‌టీఆర్ డీఎన్ఏ ప్రొఫైలింగ్

నేపాల్ పోలీసుల సూచనల మేరకు, అక్కడ అమలులో ఉన్న నిబంధనలకు అనుగుణంగా 'ఆటోసోమల్ ఎస్‌టీఆర్ డీఎన్ఏ ప్రొఫైలింగ్' విధానాన్ని ఇక్కడ అనుసరిస్తున్నారు. దీని ద్వారా తీసిన ప్రొఫైల్స్ అత్యంత కచ్చితమైన ఫలితాలను ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ మొత్తం ప్రక్రియను సులువు చేయడానికి, ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేయడానికి నేపాల్ ప్రభుత్వం ప్రత్యేకంగా 0977 9841 6160 95 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. భారత్‌లోని ల్యాబ్‌లలో రూపొందించిన డీఎన్ఏ ప్రొఫైల్స్‌ను, నేపాల్ అధికారులు ఈమెయిల్ ఐడీకి పంపాల్సి ఉంటుంది. అక్కడ లభ్యమైన మృతదేహాల డీఎన్ఏ నమూనాలతో వీటిని సరిపోల్చి చూస్తారు. అలాగే, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం ఈ మొత్తం ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తుంది. డీఎన్ఏ ప్రొఫైల్ కాపీని ఈమెయిల్‌కు కూడా పంపాలని ఎంఈఏ స్పష్టం చేసింది.

## 1,259కు చేరిన మృతుల సంఖ్య

ఇదిలా ఉండగా నేపాల్‌లో గత వారం సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా మృతుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రభావిత ప్రాంతాల నుంచి సహాయక బృందాలు మరిన్ని మృతదేహాలను వెలికితీస్తుండటంతో, మృతుల సంఖ్య కనీసం 1,259కు చేరినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. అత్యవసర సహాయక బృందాలు ఇప్పటివరకు 12 వేల మందికిపైగా ప్రజలను రక్షించినట్లు సమాచారం.

# ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ అణు కేంద్రంపై ఏ క్షణంలోనైనా దాడి

**అధ్యక్షుడు ట్రంప్**

**ఇరాన్ కీలకమైన భూగర్భ అణుకేంద్రమైన ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ను టార్గెట్ చేసిన అమెరికా**

**త్వరలోనే దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరిక**

**ఇరాన్‌కు అణ్వాయుధం దక్కనివ్వబోమని స్పష్టం**



ఇరాన్: ఇరాన్ వ్యూహాత్మక భూగర్భ అణుకేంద్రం ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’పై దాడులు చేసేందుకు అమెరికా సిద్ధమవుతోంది. ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇదే విషయాన్ని చెప్పారు. త్వరలోనే ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’పై దాడులు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఇరాన్ అణు ఆయుధాలు సాధించకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం వరుసగా దాడులు నిర్వహిస్తున్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.‘మేము దాడులు ప్రారంభించి ఐదు నెలలు అవుతోంది. ఈ వ్యవధిలో మేం సాధించిన విజయం ఏంటో తెలుసా? ఇరాన్ ఇకపై ఎప్పటికీ అణ్వాయుధం పొందలేదు. అదే మేం సాధించింది’ అని ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఇరాన్ చేతికి అణ్వాయుధాలు చిక్కితే, ప్రపంచ భద్రత ప్రశ్నార్థకంగా మారుతుందని, బహుశా తాము ఇక్కడ ఇలా మీ ముందు నిలబడి మాట్లాడే అవకాశం కూడా ఉండదన్నారు. ఇరాన్‌కు చెందిన అత్యంత సున్నితమైన ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ కేంద్రంపై అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు కన్నేసి ఉంచాయని ట్రంప్ వెల్లడించారు. ఆ ప్రాంతంలోని కదలికలను అమెరికా క్షుణ్ణంగా పరిశీలిస్తోందని చెప్పారు. ఇరాన్‌లో ఏమూలన ఏం జరుగుతుందనే ప్రతి అంశం తమకు తెలుసునని చెప్పారు. అందుకే అక్కడ ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా, తాము కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.అమెరికా సైనిక జోక్యం లేకపోతే పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దిగజారి ఉండేదని ట్రంప్ పేర్కొన్నారు. తాము సకాలంలో స్పందించడం వల్లే ఇజ్రాయెల్ ప్రస్తుతం మనుగడలో ఉందని, లేదంటే ఆ ప్రాంతమంతా అల్లకల్లోలమైపోయేదని ఆయన అన్నారు. అలాగే, యూరప్ నగరాలతో పాటు తమ దేశంపై కూడా ఇరాన్ దాడులకు దిగి ఉండేదన్నారు. ఈ ఐదు నెలల కాలంలోనే తాము ఇరాన్ దురాక్రమణను సమర్థంగా అడ్డుకున్నామని తెలిపారు. ఇరాన్‌కు చెందిన అత్యాధునిక రాడార్ వ్యవస్థలను అమెరికా బలగాలు కేవలం కొన్ని రోజుల వ్యవధిలో రెండు సార్లు పూర్తిగా నేలమట్టం చేశాయని ట్రంప్ గుర్తుచేశారు. ‘మేము మొట్టమొదటి సారి వారి రాడార్లను పేల్చివేసిన తర్వాత, వారు అత్యంత ఖరీదైన, అధునాతనమైన కొత్త రాడార్లను మళ్లీ కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. మళ్లీ వాటిని తునాతునకలు చేశాం. ఇప్పుడు అక్కడ ఎలాంటి రాడార్ కదలికలు లేవు’ అని ట్రంప్ పేర్కొన్నారు. పదే పదే తాము వాటిని పేల్చివేస్తుండటంతో, కొత్త రాడార్లను ఏర్పాటు చేయడానికి ఇరాన్ సైన్యం ఇప్పుడు వెనుకడుగు వేస్తోందన్నారు.

అమెరికా సైనిక చర్యలపై ఇరాన్ మండిపడింది. వాషింగ్టన్ తీరు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా ఉందని, తమ దేశ సార్వభౌమత్వాన్ని అమెరికా పదే పదే ఉల్లంఘిస్తోందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. అమెరికా కేవలం సైనిక స్థావరాలనే కాకుండా, పలు ప్రావిన్సుల్లోని పౌరసంచారం ఉన్న ప్రాంతాలను, మౌలిక వసతులను కూడా లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించింది. అమెరికా చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఇరాన్ హెచ్చరించింది.

### ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ ప్రత్యేకత ఏంటి?

‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ అనేది ఇరాన్ అత్యంత పటిష్టమైన భూగర్భ కాంప్లెక్స్. ఇందులో చాలా లోతుగా నిర్మించిన రెండు భారీ టన్నెల్ సిస్టమ్‌లు ఉన్నాయి. ఇజ్రాయెల్ నిఘా వర్గాలు ఈ విషయాన్ని గతంలోనే వెల్లడించాయి. ఇరాన్ తన వద్ద ఉన్న వేలాది సెంట్రిఫ్యూజ్‌లను ఈ భూగర్భ సొరంగాల్లోకి మార్చి రహస్యంగా అణు కార్యకలాపాలు సాగిస్తోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఇస్ఫాహాన్ ప్రావిన్స్‌లో నాటాంజ్ అణు కేంద్రానికి 1.5 కిలోమీటర్ల దూరంలో జాగ్రోస్ పర్వత శ్రేణిలో ఈ ప్రాంతం ఉంది. అమెరికా దాడుల్లో నాటాంజ్ యురేనియం శుద్ధి కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. 2020లో నాటాంజ్ అణు కేంద్రంలో అనుమానాస్పద పేలుడు సంభవించింది. ఈక్రమంలో ముందస్తు జాగ్రత్తగా ‘పిక్స్‌అక్స్ మౌంటెన్’ భూగర్భ నిర్మాణాన్ని ప్రారంభించింది. కొండ కింద సుమారు 100 మీటర్లకు పైగా లోతులో భారీ టన్నెల్‌లతో దీన్ని నిర్మించారు. సాధారణ వైమానిక దాడులను, బంకర్-బస్టర్ బాంబులను సైతం తట్టుకునేలా రాతి కొండల మధ్య దీన్ని నిర్మించారు. చాలా కీలకమైన ఈ కేంద్రంపై అమెరికా దాడికి దిగితే రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఎవరూ ఊహించని విధంగా మారే అవకాశాలు ఉన్నాయి.

# జంతర్ మంతర్ నిరసనకారులపై పోలీసుల దాడి బాధాకరం : సుప్రీంకోర్టు జడ్జి



**జంతర్ మంతర్ ఘటనపై సుప్రీంకోర్టు జడ్జి భుయాన్ స్పందన - పోలీసుల చర్యలు దిగ్భ్రాంతి కలిగించాయని వ్యాఖ్య**

దిల్లీ : కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో గత జులై 20న దిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రదర్శనకారుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత బాధాకరం అని, ఈ ఘటన ఆయనకు తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. దిల్లీ వైస్రాయ్ హాల్‌లో కేంద్ర ప్రభుత్వ భద్రతా వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి యశోవర్ధన్ ఆజాద్ రచించిన ‘పోలీసింగ్ ది రిపబ్లిక్’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ ఈ వ్యాఖ్యలు చేశారు.

‘నిరసనకారులు, ప్రదర్శనకారులపై ఇండియన్ పోలీస్ సర్వీసుకు చెందిన యువ అధికారులు దాడి చేయడం బాధాకరమైన విషయం. అది మనందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇలాంటి సంఘటనలు చూస్తుంటే పోలీసుల్లో నిష్పాక్షికత నశించిపోతున్నట్టుగా అనిపిస్తోంది. ఇది నిజంగానే ఆందోళనకరం. అతిగా బలప్రయోగం, మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడకుండానే పోలీసు అధికారులు తమ విధులను నిర్వర్తించవచ్చు. పోలీసు యంత్రాంగం తమ విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. పోలీసులు రాజ్యాంగానికి బద్ధులైనప్పుడే లాకప్ డెత్‌లు, లాకప్‌లో చిత్రహింసలు నిలుస్తాయి. మణిపుర్ రాష్ట్రంలో జరిగిన హింస జాతి మొత్తానికి ఒక గుణపాఠం కావాలి’ అని భుయాన్ అన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ పి. చిదంబరం, మహారాష్ట్ర మాజీ డీజీపీ డి. శివానందన్ తదితరులు పాల్గొన్నారు.

మే నెలలో నిర్వహించిన నీట్ యూజీ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ అవ్వడంతో కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో దిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు జూన్ 06న ధర్నాకు దిగారు. కేంద్ర ప్రభుత్వం ఈ పరీక్షను రద్దు చేసి మళ్లీ జూన్ 21న రీ ఎగ్జామ్ నిర్వహించింది. అయితే అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ విద్యార్థులు ధర్నా కొనసాగించారు. ఈ క్రమంలో జులై 20న చలో పార్లమెంట్ పిలుపునిచ్చారు. నిరసనకారులు పార్లమెంట్ వైపునకు దూసుకెళ్తుండగా పోలీసులు బలగాలు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చెలరేగింది.

### ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్ట్

మరోవైపు, ఇదే నిరసనల సమయంలో ఓ విద్యార్థిని తండ్రిపై దాడికి పాల్పడినట్లు ప్రకటించుకున్న ఇన్‌ఫ్లుయెన్సర్ స్వతంత్ర భరద్వాజ్‌ను దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బులందర్‌షాలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై హత్యాయత్నం, రాజ, గా అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అంతకుముందు భరద్వాజ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధులు నిరసనకు దిగారు. పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ బయట కూర్చొని దిల్లీ పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసనలో జబ్రూ కన్వీనర్లు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా, ఆజాద్ సమాజ్ పార్టీ చీఫ్, ఫ్రీ చంద్రశేఖర్ ఆజాద్ తదితరులు పాల్గొన్నారు. జులై 20న జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసన చేపట్టగా విద్యార్థిని నిషు ఆజాద్ తండ్రి సంజయ్ కుమార్‌పై దుండగులు దాడి చేశారు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. సంజయ్ కుమార్ పై తానే దాడి చేసి తల పగలగొట్టినట్టు ఇన్ ఫ్లుయెన్సర్ భరద్వాజ్ ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. పలువురు రాజకీయ నాయకులతో తనకు సంబంధాలున్నందునే తాను జైలుకు వెళ్లకుండా బయట ఉన్నట్టు చెప్పుకొచ్చారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కాగా ఇన్ ఫ్లుయెన్సర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీజేపీ ప్రతినిధులు నిరసనకు దిగారు.

# ఇరాన్‌తో ఘర్షణ అమెరికాకు చాలా చిన్న విషయం

**డొనాల్డ్ ట్రంప్**

**అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ కామెంట్స్‌పై స్పందించిన అధ్యక్షుడు ట్రంప్**

**ఇరాన్‌తో తాము యుద్ధం చేయట్లేదని వెల్లడి**

**అదోక సైనిక ఘర్షణగా అభివర్ణించిన ట్రంప్**



: ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు, సైనిక ఘర్షణలను యుద్ధంగా పరిగణించలేమని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పూర్తి మద్దతు తెలిపారు. అమెరికాకు ఈ సైనిక చర్యలు చాలా విషయంగా చెప్పుకొచ్చారు. శుక్రవారం ( అమెరికా కాలామానం ప్రకారం) వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కీలక కామెంట్స్ చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న శత్రుత్వాన్ని ఒక సైనిక ఘర్షణగా కొట్టిపారేశారు.

**సైనిక ఘర్షణ మాత్రమే**

కొన్ని వారాల విరామం తర్వాత అమెరికా ఇటీవల ఇరాన్‌పై మళ్లీ దాడులు చేసిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో ఇరాన్‌తో తాము చేసేది యుద్ధం కాదని వాన్స్ చేసిన కామెంట్స్‌పై స్పష్టత ఇవ్వాలని విలేకరులు అడిగారు. దీంతో ట్రంప్ ఈ విధంగా స్పందించారు. ‘చాలా మంది దీనిని యుద్ధం అనడం లేదు. నేను దీనిని ఒక సైనిక ఘర్షణ అంటాను. ఎందుకంటే ఇది మాకు పెద్ద విషయం కాదు, చాలా చిన్నది’ అని ట్రంప్ పేర్కొన్నారు. గతంలో అమెరికా ఎదుర్కొన్న సుదీర్ఘ యుద్ధాలతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితి పూర్తిగా భిన్నమైనదని ఆయన ఉద్ఘాటించారు. వియత్నాం వంటి గత యుద్ధాల్లో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని, కానీ ప్రస్తుత ఘర్షణలో అమెరికా నిరంతరం పోరాడకుండా కేవలం లక్షిత ప్రాంతాలపై మాత్రమే దాడులు చేస్తోందని తెలిపారు.

**అమెరికా ఆధీనంలోనే హర్మూజ్**

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి ప్రస్తుతం తమ బలగాల పూర్తి ఆధీనంలోనే ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో చెలరేగిన ఉద్రిక్తతల వల్ల ఈ జలసంధి గుండా సాగే నావికా రవాణాకు కొంత అంతరాయం కలిగినప్పటికీ, ప్రస్తుతం అమెరికా బలగాలు సమర్థంగా నియంత్రిస్తున్నాయని చెప్పారు. ఇరాన్ రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న రాడార్ వ్యవస్థలు, యుద్ధ విమానాలు, అనేక పడవలు, నౌకలను అమెరికా దళాలు ధ్వంసం చేశాయన్నారు. హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఘర్షణ వాతావరణం లేదని, రోజువారీ సముద్ర రవాణా సాఫీగా కొనసాగుతోందని ట్రంప్ తెలిపారు.

“వియత్నాం యుద్ధంలో లక్ష మంది సైనికులు చనిపోయారు. ఇతర యుద్ధాల్లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుత ఘర్షణలో అలాటి పరిస్థితి లేదు. మనం లక్ష్యాలపై విరామాలతో కూడిన దాడులు దాడులు మాత్రమే చేస్తున్నాం కాబట్టి దీన్ని యుద్ధం అనలేము. అక్కడ ఎలాంటి పోరాటాలు జరగడం లేదు. హార్ముజ్ జలసంధిని పూర్తిగా అమెరికా అదుపులోనే ఉంది”

అమెరికా గత సైనిక చర్యలతో పోలిస్తే ఈ ఘర్షణలో ప్రాణనష్టం చాలా తక్కువగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వెనిజులాలో తమ వైపు నుంచి ప్రాణనష్టమే జరగలేదని, ప్రస్తుత ఇరాన్ ఘర్షణలో 18 మంది సైనికులను కోల్పోయామని ఆయన తెలిపారు. ఇరాన్‌తో జరుగుతున్న ఈ సైనిక చర్యలను పూర్తి స్థాయి యుద్ధంగా చూపించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసే ప్రయత్నంలో భాగంగానే ట్రంప్ ఈ కామెంట్స్ చేశారు.

**ఇంతకీ వాన్స్ ఏం అన్నారంటే?**

అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌తో జరుగుతున్న ఘర్షణపై కీలక కామెంట్స్ చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలను తాను యుద్ధంగా అభివర్ణించబోనని వాన్స్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎలాంటి ప్రత్యక్ష కాల్పులు జరగడం లేదన్నారు. యుద్ధాలన్ని ఎప్పుడో ముగిశాయని ఆయన తెలిపారు. అలాగే, ఈ వివాదం ఎప్పుడు ముగుస్తుందని విలేకరులు ప్రశ్నించగా వాన్స్ ఆసక్తికర సమాధానం ఇచ్చారు. హర్మూజ్‌లో నౌకలపై ఇరాన్ కాల్పులు ఎప్పుడు ఆపేస్తుందని ఎదురు ప్రశ్నించారు. దానికి సమాధానం తన దగ్గర లేదని చెప్పారు.



## 22న భారత్–జపాన్ టీ20 మ్యాచ్

- 'సుజుకి కప్' కోసం తలపడనున్న ఇరు జట్లు
- శ్రేయస్ అయ్యర్ కెప్టెన్.. తిలక్ వర్మ వైస్ కెప్టెన్




**న్యూఢిల్లీ:** భారత్, జపాన్ పురుషుల క్రికెట్ జట్లు తొలిసారిగా టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో తలపడనున్నాయి. సెప్టెంబర్ 22న జపాన్‌లోని సానోలో జరిగే ఈ మ్యాచ్‌తో భారత్–జపాన్ దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగే పోరులో ఇరు జట్లు 'సుజుకి కప్' కోసం తలపడనున్నాయి. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఐచి–నగోయాలో జరగనున్న నేపథ్యంలో ఈ మ్యాచ్ భారత జట్టుకు సన్నాహకంగా ఉపయోగపడనుంది. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ జట్టులో ఉన్నారు. గత హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించిన భారత్.. ప్రస్తుత చాంపియన్‌గా బరిలోకి దిగనుంది. సెప్టెంబర్ 28న క్వార్టర్‌ఫైనల్‌తో తన ప్రస్థానాన్ని ప్రారంభించనుంది. 'స్పోర్ట్ 75'లో భాగంగా మ్యాచ్‌ను నిర్వహిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. క్రీడల ద్వారా ఇరు దేశాల మధ్య సంబంధాలు, సహకారాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొంది. జపాన్‌లో క్రికెట్ విస్తరణకు ఈ మ్యాచ్ కీలక అడుగని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా అన్నారు. ప్రపంచ చాంపియన్ భారత్‌తో తమ దేశంలో ఆడటం చారిత్రక ఘట్టమని జపాన్ క్రికెట్ అసోసియేషన్ సీఈఓ నయోకి మియాజీ పేర్కొన్నారు.

# మిథాలీ రాజ్ రికార్డు బద్దలు

- మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల రికార్డు సొంతం
- మిథాలీ రాజ్ రికార్డు బద్దలు కొట్టిన టీమిండియా వైస్ కెప్టెన్
- మూడు ఫార్మాట్లలో 10,880 పరుగులతో అగ్రస్థానం
- 18 శతకాలతో లానింగ్‌ను అధిగమించిన మంధాన






**దుబాయ్:** భారత వైస్ కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్‌గా కొత్త రికార్డు నెలకొల్పింది. దిగ్గజ బ్యాటర్ మిథాలీ రాజ్ పేరిట ఉన్న 10,868 పరుగుల రికార్డును అధిగమించిన మంధాన.. మూడు ఫార్మాట్లలో కలిపి 10,880 పరుగులకు చేరుకుంది. ఈ రికార్డును సాధిస్తానని తాను ఎన్నడూ ఊహించలేదని ఆమె తెలిపింది. తన కెరీర్‌లో ఎక్కువ భాగం మిథాలీ రాజ్ కెప్టెన్సీలోనే ఆడిన మంధాన.. చిన్నప్పటి నుంచే ఆమెను తన రోల్‌మోడల్‌గా భావించానని చెప్పింది. అత్యధిక పరుగుల జాబితాలో ఇద్దరు భారతీయులు అగ్రస్థానాల్లో ఉండటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొంది. మహిళల టీ20 ఆసియా కప్‌లో హాంకాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో 193 పరుగుల భారత్ స్కోరులో మంధాన కీలక పాత్ర పోషించింది. ఈ క్రమంలో టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును నమోదు చేయడంతో పాటు అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో అత్యధిక శతకాల రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. 18 శతకాలతో ఆస్ట్రేలియా దిగ్గజం మెగ్ లానింగ్ (17)ను అధిగమించింది. మధ్య ఓవర్లలో భారత బ్యాటర్లు ఆశించిన స్థాయిలో పరుగులు చేయకపోవడంపై స్పందించిన మంధాన.. జట్టులోని ఆటగాళ్లంతా ప్రపంచస్థాయి ప్రతిభ కలిగినవారేనని చెప్పింది. దుబాయ్‌లోని క్లిష్ట పరిస్థితులకు వారు త్వరలోనే అలవాటు పడతారని విశ్వాసం వ్యక్తం చేసింది. అక్కడి వేడి, తేమ కారణంగా ఎక్కువసేపు బ్యాటింగ్ చేయడం శారీరకంగా సవాలుగా ఉంటోందని పేర్కొంది.

## సచిన్‌లా కెరీర్‌ను సూర్యవంశీ నిర్మించుకోవాలి

**బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా**



**ముంబై:** యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రశంసల వర్షం కురిపించారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్‌లా అద్భుతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. ఏదో ఒక సిరీస్ లేదా ఒక సంవత్సరంలో మాత్రమే కన్పించే వండర్ ప్లేయర్‌గా మారకూడదన్నారు. గురువారం బీసీసీఐ రివ్యూ మీటింగ్ జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం సైకియా విలేకర్లతో మాట్లాడుతూ పలు విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వైభవ్ సూర్యవంశీ ప్రస్తావననూ తీసుకొచ్చారు.

"ఓ 15 ఏళ్ల కుర్రాడిని అంతర్జాతీయ క్రికెట్‌లోకి తీసుకొచ్చినందుకు బీసీసీఐ గర్వపడుతోంది. అతడి సత్తా ఏంటో ఇప్పటికే అభిమానులకు చూపించాడు. ముమ్ముందూ ఇలానే సరైన మార్గంలో సాగాలని కోరుకుంటున్నా. కొన్ని మ్యాచులకే పరిమితం కాకుండా.. సుదీర్ఘమైన కెరీర్‌ను నిర్మించుకోవాలి. అందుకు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్‌ను వైభవ్ ఆదర్శంగా తీసుకోవాలి. అంతర్జాతీయ కెరీర్‌లో అతడు వేసే ప్రతి అడుగును అన్ని కోణాల నుంచి నిశితంగా గమనిస్తూనే ఉంటాం. వైభవ్ భవిష్యత్తుపై బీసీసీఐ ప్రత్యేక దృష్టిసారించింది" అని సైకియా వెల్లడించారు.

### సఫారీలతో వన్డే సిరీస్ ?

ఇదిలా ఉండగా.. వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ జరగనుంది. దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. అయితే, వరల్డ్ కప్ ముంగిట సఫారీ జట్టుతో సిరీస్ ఆడితే బాగుంటుందనేది భారత జట్టు ఆలోచన. ఇదే విషయమై మేనేజ్‌మెంట్ కూడా దక్షిణాఫ్రికా బోర్డుతో మాట్లాడినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వన్డే సిరీస్‌లో కనీసం నాలుగు నుంచి ఆరు మ్యాచులు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు, భారత ఆటగాళ్ల ఫిట్‌నెస్ విషయంలోనూ బోర్డు కఠినంగా ఉండనుంది. రివ్యూ మీటింగ్‌లో ఇదే ప్రధాన అంశంగా చర్చించినట్లు సమాచారం



## చైనా మాస్టర్స్‌లో శ్రీకాంత్ ఔట్

- క్వార్టర్ ఫైనల్లో లీ చెక్ యూ చేతిలో వరుస గేముల్లో పరాజయం
- 39 నిమిషాల్లోనే ముగిసిన భారత మాజీ ప్రపంచ నంబర్ వన్ పోరాటం




**షెన్‌జెన్ (చైనా):** చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ కిదాంబి శ్రీకాంత్ క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించాడు. హాంకాంగ్‌కు చెందిన 25వ ర్యాంకర్ లీ చెక్ యూ చేతిలో 16–21, 16–21తో 39 నిమిషాల్లో ఓడిపోయాడు. గతంలో ప్రపంచ నంబర్‌వన్‌గా నిలిచిన 33 ఏళ్ల శ్రీకాంత్ ఈ ఏడాది యూఎస్ ఓపెన్ సూపర్ 300లో రన్నరప్‌గా నిలిచాడు. చైనా మాస్టర్స్‌లో ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ విక్టర్ లాయ్‌ను 21–18, 21–19తో ఓడించి క్వార్టర్స్ చేరాడు. అయితే లీ చెక్‌తో మ్యాచ్‌లో తొలి గేమ్‌లో 3–0 ఆధిక్యం సాధించినా.. ప్రత్యర్థి వరుసగా ఆరు పాయింట్లు సాధించడంతో 6–14తో వెనుకబడ్డాడు. రెండో గేమ్‌లోనూ శ్రీకాంత్ 4–0తో ఆధిక్యంలోకి వచ్చినప్పటికీ లీ 4–4తో సమం చేశాడు. 15–15 వరకు హోరాహోరీగా సాగిన పోరులో లీ వరుసగా మూడు పాయింట్లు సాధించి 18–15తో ఆధిక్యంలోకి వెళ్లి మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సెమీఫైనల్లో లీ చెక్ యూ ప్రపంచ రెండో ర్యాంకర్ క్రిస్టో పోపోవ్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు.

# పాక్‌పై మనదే పైచేయి!

- టైటిల్ ఫేవరెట్‌గా భారత్
- నేడు మహిళల ఆసియా కప్‌లో తలపడనున్న చిరకాల ప్రత్యర్థులు
- ఇప్పటికే సెమీస్‌కు చేరిన హర్మన్ సేన



**దుబాయ్:** మహిళల ఆసియా కప్‌లో ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించిన భారత్.. శనివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో చివరి లీగ్ మ్యాచ్‌లో తలపడనుంది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో భారత్ స్పష్టమైన ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. ఆసియా స్థాయిలో భారత్‌కు సమీపంగా నిలిచే జట్టు లేకపోయినా.. గతంలో రెండు టీ20 ప్రపంచకప్‌లలో ముందుగానే నిష్క్రమించిన నేపథ్యంలో స్వల్ప ఫార్మాట్‌లో జట్టు మరింత బలపడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పవర్ హిట్టర్లు, పేసర్లతో మెరుగైన బృందాన్ని సిద్ధం చేసుకోవాల్సి ఉంది. హాంకాంగ్‌పై శతకంతో పలు రికార్డులు బద్దలు కొట్టిన స్మృతి మంధానతో పాటు షఫాలీ వర్మ మంచి ఫామ్‌లో ఉన్నారు. ప్రతికా రావల్, రిచా ఘోష్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాత్రం వచ్చిన అవకాశాలను భారీ స్కోర్లుగా మలచాల్సి ఉంది. కొత్త నంబర్–3 ప్రతికా రావల్‌పై ఒత్తిడి పెరుగుతోంది. పేస్ విభాగంలో క్రాంతి గౌడ్‌తో కలిసి నందినీ శర్మ రాణించడం భారత్‌కు సానుకూలాంశం. మరోవైపు పాకిస్థాన్ బ్యాటింగ్ బలహీనత ఆ జట్టుకు ప్రధాన సమస్యగా మారింది. థాయ్‌లాండ్‌పై గత మ్యాచ్‌లోనూ పవర్‌ప్లేలో మూడు వికెట్లు కోల్పోయింది. చివరకు 119 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కాపాడుకుంది. ఓపెనర్ మునీబా అలీ, కెప్టెన్ ఫాతిమా సనాపైనే ఆ జట్టు ఎక్కువగా ఆధారపడుతోంది. భారత్‌ను సవాల్ చేయాలంటే బ్యాటింగ్‌లో గణనీయమైన మెరుగుదల అవసరం.

## నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్




- 362 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
- మెటల్, చమురు షేర్లలో కొనుగోళ్లు.. 24 వేల దిగువన నిఫ్టీ

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస నష్టాలకు తెరదించాయి. మెటల్, చమురు–గ్యాస్, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు జరగడంతో శుక్రవారం సెన్సెక్స్ 362.57 పాయింట్లు (0.48 శాతం) లాభపడి 76,515.43 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 730 పాయింట్లకుపైగా లాభపడి 76,883.14ను తాకింది. నిఫ్టీ 24.25 పాయింట్లు (0.10 శాతం) పెరిగి 23,897.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24 వేల మార్కును దాటి 24,005.75కు చేరినా, చివర్లో లాభాల స్వీకరణతో ఆ స్థాయికి దిగువన ముగిసింది. సెన్సెక్స్‌లో టాటా స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్, ట్రెంట్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్ తదితర షేర్లు లాభపడగా.. భారతి ఎయిర్‌టెల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, సన్ ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ సుజుకీ తదితరాలు నష్టపోయాయి.

### మెటల్ షేర్లకు జోష్

బీఎస్ఈ మెటల్ సూచీ 1.42 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. హౌసింగ్ ఫైనాన్స్, టెలికాం, ఇన్సూరెన్స్ సూచీలు కూడా 1 శాతానికి పైగా పెరిగాయి. రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ సూచీలు 0.66 శాతం చొప్పున నష్టపోయాయి. మొత్తం మీద బీఎస్ఈలో 2,482 షేర్లు లాభపడగా.. 1,901 షేర్లు నష్టపోయాయి. ఇక వారంవారీగా సెన్సెక్స్ 749.08 పాయింట్లు (0.96 శాతం), నిఫ్టీ 277.95 పాయింట్లు (1.14 శాతం) నష్టపోయాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల పెంపుపై ఆందోళనలు తగ్గడంతో ఊరట ర్యాలీ కనిపించిందని మార్కెట్ నిపుణులు తెలిపారు. అయితే అధిక స్థాయిల వద్ద లాభాల స్వీకరణ, పశ్చిమాసియా ఉద్రిక్తతలు లాభాలను పరిమితం చేశాయని పేర్కొన్నారు.

# ఎన్ఎస్ఈ ఐపీఓకు సెబీ గ్రీన్‌సిగ్నల్

- రూ.30 వేల కోట్లతో భారీ పబ్లిక్ ఇష్యూ
- ఈ నెల 15న ప్రారంభం.. 24–25న లిస్టింగ్‌కు సన్నాహాలు




**న్యూఢిల్లీ:** దాదాపు దశాబ్దకాలంగా వాయిదా పడుతూ వస్తున్న నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. శుక్రవారం సెబీ 'అబ్జర్వేషన్ లెటర్' జారీ చేయడంతో ఐపీఓకు మార్గం సుగమమైంది. మొత్తం 14.89 కోట్ల షేర్లను, అంటే ఎన్ఎస్ఈ పెయిడ్ అప్ క్యాపిటల్‌లో సుమారు 6 శాతం వాటాను, ప్రస్తుత వాటాదారులు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు. దీని ద్వారా దాదాపు రూ.30 వేల కోట్లు సమీకరించే అవకాశం ఉంది.

### జియోతో అతిపెద్ద ఐపీఓ పోటీ

ఎన్ఎస్ఈ ఐపీఓ దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచే అవకాశం ఉంది. ముకేశ్ అంబానీకి చెందిన జియో ప్లాట్‌ఫామ్స్ సుమారు రూ.37,700 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతున్నప్పటికీ, దాని తేదీ ఇంకా ఖరారు కాలేదు. ఎన్ఎస్ఈ ఇష్యూ 2024లో హ్యుందాయ్ మోటార్ ఇండియా సమీకరించిన రూ.27,858.75 కోట్లను, 2022లో ఎల్ఐసీ సమీకరించిన రూ.20,557.23 కోట్లను అధిగమించనుంది. ఐపీఓ ధరల శ్రేణిని వచ్చే వారం ప్రకటించే అవకాశం ఉంది. సెప్టెంబర్ 15న ఇష్యూ ప్రారంభించి, 24–25న లిస్టింగ్ చేయాలని ఎన్ఎస్ఈ భావిస్తోంది. ఒక్కో షేరు ధర సుమారు రూ.2,000 ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐపీఓ అనంతరం ఎన్ఎస్ఈ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లకు పైగా ఉండొచ్చని తెలుస్తోంది.

### కో–లొకేషన్ కేసులతో ఆలస్యం

ఎన్ఎస్ఈ 2016లోనే ఐపీఓకు దరఖాస్తు చేసినా, కో–లొకేషన్ వ్యవహారం, పాలనాపరమైన లోపాలపై సెబీ దర్యాప్తు కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. ఈ ఏడాది ఎన్ఎస్ఈకి సెబీ ఎన్ఓసీ లభించడంతో జూన్ 17న డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది. కో–లొకేషన్, డార్క్ ఫైబర్ వ్యవహారాల పరిష్కారంలో భాగంగా ఎన్ఎస్ఈ మొత్తం రూ.1,491.21 కోట్లు చెల్లించింది. ఈ కేసులపై సెబీ దాఖలు చేసిన అప్పీళ్లను సుప్రీంకోర్టు ఈ వారం కొట్టివేయడం కూడా కీలక పరిణామంగా మారింది.

### ఎల్ఐసీ వాటా విక్రయించదు

ఎస్‌బీఐ 2.48 కోట్ల వరకు షేర్లు, ఎంఎస్ స్ట్రాటజిక్ (మారిషస్) 1.60 కోట్ల షేర్లు విక్రయించనున్నాయి. ఎన్ఎస్ఈలో 10.72 శాతం వాటాతో అతిపెద్ద వాటాదారైన ఎల్ఐసీ మాత్రం ఈ ఐపీఓలో షేర్లు విక్రయించదు. ఇతర వాటాదారుల్లో కెనడా పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు, అరండా ఇన్వెస్ట్‌మెంట్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర సంస్థలు ఉన్నాయి.

### తొలి త్రైమాసికంలో లాభాల వృద్ధి

2025–26లో ఎన్ఎస్ఈ లాభం 15 శాతం తగ్గి రూ.10,302 కోట్లకు చేరింది. అయితే 2026–27 తొలి త్రైమాసికంలో పన్ను అనంతర లాభం 7 శాతం పెరిగి రూ.3,120 కోట్లకు, మొత్తం ఆదాయం 9 శాతం వృద్ధితో రూ.5,252 కోట్లకు చేరింది. ఐపీఓను నిర్వహించేందుకు 20 మంది మర్చంట్ బ్యాంకర్లు వ్యవహరిస్తున్నారు.

## ప్రైవేట్ బ్యాంకుల్లో సీఈఓల మార్పులు

- హెచ్‌డీఎఫ్‌సీ, ఉజ్జీవన్‌లో కొత్త అధిపతుల కోసం అన్వేషణ
- కొటక్, ఫినోల్లో తుది దశకు నియామక ప్రక్రియ




**న్యూఢిల్లీ:** ప్రైవేట్ బ్యాంకింగ్ రంగంలో నాయకత్వ మార్పులు కొనసాగుతున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లు కొత్త ఎండీ, సీఈఓల కోసం అన్వేషణ ప్రారంభించగా.. కొటక్ మహీంద్రా, ఫినో పేమెంట్స్ బ్యాంకుల్లో నియామక ప్రక్రియ తుది దశకు చేరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ పదవీకాలం అక్టోబర్ 26తో ముగియనుంది. పునర్నియామకానికి దరఖాస్తు చేయకూడదని ఆయన నిర్ణయించుకోవడంతో బోర్డు కొత్త అధిపతి ఎంపికను వేగవంతం చేసింది. ఎంఎస్ఆర్‌డీసీ డిపాజిట్ల వ్యవహారంలో లోపాలను గుర్తించిన బోర్డు జగదీశన్‌తో పాటు ఇతర అధికారులకు రూ.లక్ష చొప్పున జరిమానా విధించింది. ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ ఎండీ, సీఈఓ సంజీవ్ నౌటియాల్ ముందస్తు పదవీ విరమణ కోరడంతో ఆయన స్థానంలో కొత్త అధిపతి కోసం అన్వేషణ మొదలైంది. కొటక్ మహీంద్రా బ్యాంక్ సీఈఓ అశోక్ వాస్వానీ పదవీకాలం డిసెంబర్ 31తో ముగియనుండగా.. పొడిగింపునకు ఆసక్తి చూపకపోవడంతో అంతర్గత అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసినట్లు సమాచారం. ఫినో పేమెంట్స్ బ్యాంక్ సీఈఓ రిషి గుప్తా జీఎస్టీ చట్ట ఉల్లంఘనల ఆరోపణలపై ఫిబ్రవరిలో అరెస్టయ్యారు. దీంతో సీఎఫ్ఓ కేతన్ మర్చంట్‌ను తాత్కాలిక అధిపతిగా నియమిం చి, కొత్త సీఈఓ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. బ్యాంకు బోర్డులు ఎంపిక చేసిన అభ్యర్థుల పేర్లను ఆర్‌బీఐకి పంపాలి. సమగ్ర పరిశీలన అనంతరం ఆర్‌బీఐ ఆమోదంతోనే నియామకాలు పూర్తవుతాయి. కాగా, 2020లో టెక్నాలజీ అంతరాయాల కారణంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుపై విధించిన క్రెడిట్ కార్డులు, కొత్త డిజిటల్ సేవల ఆంక్షలను 15 నెలల్లో ఎత్తివేయడంలో జగదీశన్ నేతృత్వం కీలకంగా నిలిచింది.

## ఆర్‌బీఐకి రూ.6.02 లక్షల కోట్ల మిగులు ద్రవ్యత

- రెండు వీఆర్ఆర్ఆర్ వేలాలతో అదనపు నిధుల ఉపసంహరణ
- బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.10.32 లక్షల కోట్ల మిగులు




**ముంబై:** బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్యత రికార్డు స్థాయికి చేరడంతో ఆర్‌బీఐ రెండు వీఆర్ఆర్ఆర్ వేలాల ద్వారా రూ.6,02,394 కోట్లను ఉపసంహరించుకుంది. తొలి వేలంలో రూ.5,41 ,975 కోట్లు, రెండో వేలంలో రూ.60,419 కోట్లను బ్యాంకులు ఆర్‌బీఐ వద్ద పార్క్ చేశాయి. రెండు వేలాల్లో కటాఫ్ రేటు 5.24 శాతంగా ఉంది. ప్రత్యేక ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్లతో నిధుల ప్రవాహం పెరగడంతో సెప్టెంబర్ 3 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.10.32 లక్షల కోట్ల మిగులు ఏర్పడింది. ఆగస్టు 31 నాటికి ఎఫ్‌సీఎన్ఆర్(బీ) ద్వారా 127.23 బిలియన్ డాలర్లు సమీకరించారు. భారీ స్పందనతో ఈ పథకాన్ని నెల ముందుగానే ముగించారు. మిగులు ద్రవ్యత కారణంగా కాల్ మనీ రేటు 4.93 శాతానికి తగ్గింది. రెపో రేటుకు అనుగుణంగా రేట్లను ఉంచేందుకు ఆర్‌బీఐ ఆగస్టు నుంచి సెప్టెంబర్ 4 వరకు 32 వీఆర్ఆర్ఆర్ వేలాలు నిర్వహించింది.

# అపార్ట్‌మెంట్లే అతిపెద్ద ఆఫ్‌లైన్ సోషల్ నెట్‌వర్క్‌లు

- క్రీడలు, పండుగలు, కొనుగోళ్లతో పొరుగువారిని కలుపుతున్న గేటెడ్ కమ్యూనిటీలు
- 25 వేలకుపైగా సొసైటీల్లో నోబ్రోకర్ హుడ్
- 50 లక్షలకు పైగా కుటుంబాలకు సేవలు

**బెంగళూరు:** దేశవ్యాప్తంగా గేటెడ్ కమ్యూనిటీలు సామాజిక అనుబంధాలకు వేదికలుగా మారుతున్నాయి. క్రీడలు, పండుగలు, వస్తువుల కొనుగోలు, విక్రయాలు, పరస్పర సహకారంతో అపార్ట్‌మెంట్ జీవనం మరింత అనుసంధానితంగా మారుతోంది. ఈ మార్పులో నోబ్రోకర్‌హుడ్ డిజిటల్ వేదికగా పనిచేస్తోంది. దేశవ్యాప్తంగా 25 వేలకుపైగా సొసైటీల్లో సేవలు అందిస్తున్న నోబ్రోకర్‌హుడ్‌కు ప్రధాన మెట్రోల్లో గేటెడ్ కమ్యూనిటీ మార్కెట్‌లో సుమారు 45 శాతం వాటా ఉన్నట్లు సంస్థ తెలిపింది. ఎన్‌సీఆర్, పుణె, అహ్మదాబాద్‌లో అగ్రస్థానంలో ఉండగా.. బెంగళూరులో గత ఏడాది 1,500కుపైగా సొసైటీలను చేర్చుకుంది. యాప్ ద్వారా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, స్విమ్మింగ్ వంటి సదుపాయాల బుకింగ్, క్రీడా కార్యక్రమాల నిర్వహణ చేపట్టవచ్చు. దీపావళి, హోలీ, గణేశ్ చతుర్థి, క్రిస్మస్, ఓణం, నవరాత్రి వేడుకలకు సంబంధించిన ప్రకటనలు, విరాళాల సేకరణ, అప్‌డేట్లను కూడా నిర్వహించవచ్చు. నిర్వహణ, యుటిలిటీ బిల్లుల చెల్లింపులు, డీప్ క్లీనింగ్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి.

### నమ్మకమైన కమ్యూనిటీ మార్కెట్

ధ్రువీకరించిన సభ్యుల మధ్య ఫర్నిచర్, పుస్తకాలు, గృహోపకరణాలు, పిల్లల వస్తువులు, వాహనాల కొనుగోలు, విక్రయాలకు వేదిక కల్పిస్తోంది. ఇంటిపనివారు, వంటవారు, డ్రైవర్ల సిఫారసులు, యోగా, ట్యూషన్ల సమాచారాన్ని పంచుకోవడంతోపాటు లిఫ్ట్, నీటి సమస్యల వంటి ఫిర్యాదులను పరిష్కారం వరకు ట్రాక్ చేయవచ్చు. టెక్నాలజీతో కమ్యూనిటీ జీవనాన్ని అనుసంధానితంగా, చురుకుగా మార్చడమే లక్ష్యం అని నోబ్రోకర్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ అమిత్ కుమార్ అగర్వాల్ తెలిపారు. నోబ్రోకర్‌హుడ్ ద్వారా 50 లక్షలకు పైగా కుటుంబాలకు సేవలందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## కొణిదెల ఇంట్లోకి చిన్ని కృష్ణుడు

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన దంపతులు తమ ముగ్గురు చిన్నారులతో కలిసి కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ పవిత్ర పండుగ సందర్భంగా తమ ముగ్గురు పిల్లలను శ్రీకృష్ణుడు, రాధారాణి రూపాల్లో ముచ్చటగా ముస్తాబు చేసి, ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఉపాసన కొణిదెల తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. కొణిదెల వారి ఇంట్లోకి చిన్న కృష్ణుడు అడుగుపెట్టాడని, దీంతో తన కల నెరవేరిందని పెట్టిన ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. అయితే గతంలో లాగే ఈసారి కూడా తమ చిన్నారుల ముఖాలు స్పష్టంగా కనిపించకుండా కొణిదెల దంపతులు జాగ్రత్త పడ్డారు. ఈ క్యూట్ ఫొటోలు చూసిన మెగా అభిమానులు, నెటిజన్లు వావ్ సూపర్ అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తుండగా, మరికొందరు మాత్రం కవల పిల్లల ముఖాలను చూపించాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. కాగా.. రామ్ చరణ్, ఉపాసన దంపతులకు 2023 జూన్ 20న మొదటి సంతానంగా క్లీంకార జన్మించగా, ఈ ఏడాది ఫిబ్రవరిలో కవల పిల్లలు జన్మించిన సంగతి తెలిసిందే. కవలల్లో అబ్బాయికి శివరామ్ అని, అమ్మాయికి అన్వీరా దేవి అని పేరు పెట్టారు. పిల్లలు పుట్టినప్పటి నుండి వారి ప్రైవసీకి పెద్దపీట వేస్తున్న మెగా ఫ్యామిలీ, క్లీంకార పుట్టిన మూడేళ్లకు మాత్రమే ఆమె ముఖాన్ని మీడియాకు పరిచయం చేశారు. ఇప్పుడు కొణిదెల ఇంట్లోకి అడుగుపెట్టిన ఈ చిన్ని కృష్ణుడు, రాధారాణిల ముఖాలను ఎప్పుడు చూపిస్తారా అని మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## చియాన్ విక్రమ్ 'ధ్రువ నక్షత్రం'

### కోర్టును ఆశ్రయించిన డైరెక్టర్

చియాన్ విక్రమ్ హీరోగా, దర్శకుడు గౌతమ్ వాసుదేవ మీనన్ కలయికలో తెరకెక్కిన చిత్రం 'ధ్రువ నక్షత్రం'. ఈ సినిమా కంప్లీట్ అయ్యి నాలుగు, ఐదు సంవత్సరాలు కంప్లీట్ అవుతున్నప్పటికీ రిలీజ్‌కు మాత్రం నోచుకోలేదు. ఈ సినిమా నిర్మాతలకు, పెట్టుబడిదారులకు మధ్య నెలకొన్న వివాదం కోర్టులో ఉంది. అయితే.. వరుస వాయిదాలు, ప్రతి పాదనల అనంతరం 2026, జూన్ 15న విడుదల చేస్తానంటూ మద్రాసు హైకోర్టును డైరెక్టర్ వాసుదేవవమీనన్ కోరాడు. కానీ అనుకున్న టైమ్‌కి రిలీజ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మళ్లీ మరోసారి ఆయన కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తుంది. చియాన్ విక్రమ్ ప్రధాన పాత్రలో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ధ్రువ నక్షత్రం చిత్రాన్ని విడుదల చేయడానికి, 2026 సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించాలని కోరుతూ దర్శకుడు, నిర్మాత, నటుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనకు సంబంధించిన విచారణను జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి 2026 సెప్టెంబర్ 11కి వాయిదా వేశారు. మరి ఈ సినిమా విడుదలపై ఫైనల్ జడ్జిమెంట్ ఏమని వస్తుందో వేచి చూడాల్సి ఉంది.



## ఇంకోసారి ఇలాంటి సినిమా చేయను



టాలీవుడ్ హీరో సుహాస్, తమిళ నటుడు సూరి ప్రధాన పాత్రల్లో నటించిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా చిత్రం 'మండాడి'. సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూల్లో ఆసక్తికర విషయాలు పంచుకుంటున్నారు సుహాస్. ఈ సినిమా క్లైమాక్స్‌లో చేసిన రిస్క్ గురించి తాజాగా వెల్లడించారు. ''సముద్రంలో షూటింగ్ చేసేటప్పుడు చాలా భయపడ్డాను. ఆ సమయంలో జీవితమంటే ఏంటో తెలిసింది. షూటింగ్ అయిపోయాక సముద్రానికి దండం పెట్టాను. బతికించినందుకు థాంక్స్ అంటూ బయటకు వచ్చాను. నాకే కాదు.. చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ ఇలానే అనిపించింది. మూడునాలుగుసార్లు బతికిపోయాం అనుకున్న సందర్భాలూ ఎదురయ్యాయి. కెమెరామెన్‌లు సముద్రంలో పడిపోయారు. బోట్లు తిరగపడే సందర్భాలు వచ్చాయి. మేం నీళ్లలో పడ్డాం. నేను ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఇదే అత్యంత రిస్క్ చేసిన చిత్రం. మరోసారి ఇంత రిస్క్ ఉన్న సినిమా చేయను. ఎందుకంటే అన్నిటికంటే జీవితం ముఖ్యం కదా!'' ''ఈ కథ బాగుంది. అందుకే మొండిగా ముందుకు పోయాం. నిర్మాతలు ఏ విషయంలోనూ రాజీ పడకుండా తీశారు. వాళ్లు మనపై నమ్మకంతో చేస్తున్నప్పుడు మనం కూడా అలానే ప్రాణం పెట్టి చేయాలి. 45 రోజులు సముద్రంలోనే క్లైమాక్స్ మొత్తం షూట్ చేశాం. ఈ షెడ్యూల్ తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. ముఖ్యంగా చాలా విషయాల్లో భయం పోయింది. నా జీవితంలో అది ఒక కొత్త అనుభవం. సముద్రంలో సిగ్నల్ ఉండదు. ఫోన్‌లు పనిచేయవు. విరామం సమయంలో బోట్‌లో ఉన్న వాళ్లతో మాట్లాడుతూ గడిపేశా'' అని సుహాస్ చెప్పారు. ఇక తన సహ నటుడు సూరి గురించి మాట్లాడుతూ.. ఆయన చాలా త్వరగా కలిసిపోతారని.. సెట్స్‌లోనూ సరదాగా నవ్వించేవాడని తెలిపారు. అందరితోనూ అలానే ఉంటాడని చెప్పారు.



## సంక్రాంతి రేసులో 'కాకా'



టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మరోసారి రికార్డులను తిరగరాసేందుకు మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ (కె.ఎస్. రవీంద్ర) మరో అడుగు ముందుకు వేస్తున్నారు. వీరిద్దరి కలయికలో ఇప్పటికే వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'వాల్తేరు వీరయ్య' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ క్రేజీ కాంబోలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కాకా' సినిమాకు సంబంధించిన కీలకమైన షూటింగ్ అప్‌డేట్‌ను చిత్రబృందం వెల్లడించింది. ఈ భారీ ప్రాజెక్ట్‌కి సంబంధించిన తదుపరి కీలక షెడ్యూల్ సెప్టెంబర్ 7వ తేదీ నుంచి హైదరాబాద్ వేదికగా ప్రారంభం కానుంది. ఈ తాజా షెడ్యూల్‌లో సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాలతో పాటు హై–వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కించడానికి దర్శకుడు బాబీ ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మాత వెంకట్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో, ఎక్కడా రాజీ పడకుండా నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు మరియు షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేస్తున్న మేకర్స్, ఈ సినిమాను 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కొత్త లుక్‌లో కనిపించబోతున్న ఈ చిత్రంలో ఆయనతో పాటు నటి అనస్వర రాజన్, నివేతా పేతురాజ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## హీరోయిన్ల వివాదంపై తాప్సీ షాకింగ్ కామెంట్స్

సినిమాల్లో హీరోయిన్లను చూపించే విధానం మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ముఖ్యంగా భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన రామ్ చరణ్ 'పెద్ది' , కన్నడ స్టార్ హీరో యష్ నటించిన 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్–అప్స్' చిత్రాల్లో మహిళా పాత్రలను ప్రెజెంట్ చేసిన తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. హీరోయిన్ల పాత్రలు, వారి లుక్, దుస్తులు, కెమెరా యాంగిల్స్ విషయంలో గ్లామర్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారనే అభిప్రాయాలు నెటిజన్ల నుంచి వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో తాజాగా హీరోయిన్ తాప్సీ పన్ను చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. తన తాజా చిత్రం 'గాంధారి' ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తాప్సీ.. సినిమా పరిశ్రమలో 'డిమాండ్ అండ్ సప్లై' విధానం, సోషల్ మీడియా విమర్శలు, ప్రేక్షకుల అభిరుచులపై కీలక వ్యాఖ్యలు చేసింది. సినిమాల్లో హీరోయిన్లను గ్లామర్‌గా చూపించడంపై సోషల్ మీడియాలో వచ్చే విమర్శల గురించి తాప్సీని ప్రశ్నించగా.. డిజిటల్ ప్రపంచానికి, గ్రౌండ్ లెవల్‌లో ఉన్న ప్రేక్షకుల అభిప్రాయాలకు చాలా తేడా ఉంటుందని ఆమె చెప్పింది. ముఖ్యంగా మాస్ సినిమాల విషయంలో సోషల్ మీడియాలో వచ్చే విమర్శలు సినిమాలపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని తాప్సీ అభిప్రాయపడింది. నెట్‌లో ఎంత చర్చ జరిగినా.. అదే గ్లామర్ ఫొటోలను జూమ్ చేసి, వివిధ యాంగిల్స్‌లో వీడియోలు తయారు చేసి వైరల్ చేసే వాళ్లు కూడా సోషల్ మీడియాలోనే ఉన్నారని ఆమె పేర్కొంది. అంటే ఒకవైపు అదే కంటెంట్‌ను విమర్శిస్తూ.. మరోవైపు దానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను వైరల్ చేయడం కూడా జరుగుతోందని తాప్సీ చెప్పుకొచ్చింది. దీనిని బట్టి అలాంటి కంటెంట్‌కు సోషల్ మీడియాలో కొంత మేర ఆదరణ ఉందనే విషయాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ఆమె అభిప్రాయపడింది.

సినిమా పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు ఎందుకు వస్తున్నాయన్న దానిపై తాప్సీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ఇండస్ట్రీలో కూడా డిమాండ్ అండ్ సప్లై సూత్రమే పనిచేస్తుందని ఆమె చెప్పింది. ప్రేక్షకులు ఇలాంటి కంటెంట్‌ను కోరుకుంటున్నారని, దాని ద్వారా సినిమాలకు డబ్బులు వస్తాయని నిర్మాతలు, దర్శకులు భావించినప్పుడు అదే తరహా సినిమాలు, సన్నివేశాలు తెరకెక్కుతాయని తాప్సీ పేర్కొంది.

పదవీ విరమణ శుభాకాంక్షలు



మీ కుటుంబ సభ్యులు, మీ బంధువులు, మీ ఆఫీసులో ఉద్యోగులు
ఎవరైనా రిటైర్డ్ అవుతున్నారా ! అయితే వారికి మీరు
శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా?
మా తొలివెలుగు జాతీయ దినపత్రిక
ద్వారా తెలియజేయగలరు.
పూర్తి వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
సెల్: 9491134365

Printed, Published & Owned by YAMJALA PRAVEEN, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS,** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published From 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, and Telangana - 508252. **Editor: YAMJALA PRAVEEN, PRGI.No. TGTEL/26/A6221,** Ph.No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website : ww.tholivelugu.com